ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
మంగళవారం 11 నవంబరు 2025 | 5





కార్తీక సోమవారం సందర్భంగా విద్యుత్ అలంకరణతో ఆకట్టుకుంటున్న కాకినాడలోని తూరంగేశ్వర రామలింగేశ్వరస్వామి ఆలయం

ఢిల్లీ పేలుడు ఘటన నేపథ్యంలో..
జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

కాకినాడ/కాకినాడక్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఎర్రకోటవద్ద కారులో బాంబుపేలుడు ఘటన నేపథ్యంలో జిల్లాలో సోమవారం రాత్రి పోలీసులు అలర్ట్ అయ్యారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, జాతీయ రహదారుల్లో తనిఖీలు చేపట్టారు. కాకినాడలో ఎస్పీ బిందుమాధవ్ నేతృత్వంలో ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్, ఎస్బీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు, వన్‌టౌన్, త్రీటౌన్, సర్పవరం, కాకినాడ రూరల్ సీఐలు, ఎస్ఐలు తనిఖీలు నిర్వహించారు. కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో ప్రయాణికుల బ్యాగ్‌లను బాంబ్ డిటెక్టర్లతో తనిఖీ చేశారు. డాగ్ స్క్వాడ్‌లతో కార్లను పరిశీలించారు. మెరైన్, పోర్టు పోలీసులు పోర్టు తీరం వెంబడి భద్రత కట్టుదిట్టం చేశారు. పిఠాపురం పాదగయ సెంటర్‌లో సీఐ శ్రీనివాస్, ప్రత్తిపాడులో ఎస్ఐ లక్ష్మీకాంతం, కృష్ణవరం టోల్‌ప్లాజావద్ద తనిఖీలు చేశారు.





కాకినాడలో రైల్వేస్టేషన్ వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్పీ బిందుమాధవ్, ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్



పిఠాపురంలో కారును తనిఖీ చేస్తున్న సీఐ శ్రీనివాస్

వాకాడలో కనుల పండువగా..
కోటి దీపాల సంబరం

- భారీ టవర్ ఆకృతులపై దీపాలు వెలిగించిన మహిళలు



వాకాడలో దీపాలు వెలిగిస్తున్న యువతి

6

నేడు జిల్లా సమీక్ష కమిటీ సమావేశం

- హాజరుకానున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి నారాయణ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు జిల్లా సమీక్ష కమిటీ(డీఆర్‌సీ) సమావేశం నిర్వహిస్తున్నామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ విచ్చేస్తున్నారు.

సీఎం చంద్రబాబును
కలిసిన వర్మ



చంద్రబాబును సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ సోమవారం రాత్రి కలిశారు. అమరావతిలోని సచివాలయంలో సీఎంను కలిసి సత్కరించారు. జిల్లాలోని పార్టీ విషయాలపై చర్చించారు. మొంథా తుఫాన్ సమయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మత్స్యకారులు, రైతులు, ప్రజలకు అండగా నిలిచారని తెలిపారు. ఈ విషయంలో సీఎం అభినందించారు.

పిచ్చికుక్కదాడిలో చికిత్స పొందుతూ మూడేళ్ల బాలుడి మృతి

7



వెరీ.. వెరీ.. గుడ్డు
కార్తీకంలోనూ అధరహో

- ఒక్కో గుడ్డు హోల్‌సేల్ రూ.6
- రిటైల్‌లో రూ.7కి విక్రయం
- ధరలకు రెక్కలు
- వినియోగదారులకు చుక్కలు
- పౌల్ట్రీ రైతులకు ఊరట
- కూరగాయలతో పోటీ
- లాభాల్లో రైతాంగం

మండపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎన్నడూ లేనిది కార్తీకమాసంలో గుడ్డు ధర పరుగులు పెడుతోంది. ప్రతి ఏడాది కార్తీకమాసంలో గుడ్డు ధర తక్కువగా ఉండేది. ఎందుకంటే ఈ మాసంలో శాకాహారులు ఎక్కువగా ఉంటారు. దీంతో ఎప్పుడూ గుడ్డు ధర తక్కువగా ఉండేది. అయితే దానికి భిన్నంగా ఈ ఏడాది మాత్రం పరుగులు పెడుతోంది. కోళ్ల ఫారాల నిర్వాహకులకు లాభాలు పండిస్తుంటే సామాన్యుడు మాత్రం గుడ్డు తినలేని పరిస్థితి కనిపిస్తోంది. గత రెండేళ్లపాటు పౌల్ట్రీ పరిశ్రమ ఒడిదుడుకులు చెందగా ఇప్పుడిప్పుడే పరిశ్రమ కుదుటపడుతోంది. గతంలో పరిశ్రమ నష్టాల కారణంగా చాలామంది రైతులు కోళ్ల ఫారాలను మూసివేశారు. కొంతమంది అయితే బ్యాచ్‌లు వేయలేదు. గతంలో అయితే బ్యాచ్‌లు వేసి గుడ్ల ఉత్పత్తి చేసేవారు. ప్రస్తుతం ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్‌కు సరిపడా సరుకు లేకపోవడంవల్ల ధరలు పెరుగుదలకు కారణమని నిర్వాహకులు చెబుతున్నారు. ఒక గుడ్డు ఉత్పత్తికి రూ.4.80 పైసలు అవుతుంది. రూ.5 దాటి ధర ఉంటేనే గిట్టుబాటు ఉంటుందని పౌల్ట్రీ రైతులు అంటున్నారు.

గుడ్డు ధర ఊరట

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 300వరకు కోళ్ల ఫారాలు ఉన్నాయి. వీటిలో 1.40 కోట్ల మేర కోళ్లను పెంచుతున్నారు. రోజుకు 1.10 కోట్ల మేర గుడ్ల ఉత్పత్తి జరుగుతోంది. 40 శాతం స్థానిక అవసరాలకు విని యోగిస్తుండగా 60 శాతం గుడ్లు పొరుగు రాష్ట్రాలైన ఒడిశా, బిహార్, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. ఇక ప్రభుత్వం అంగన్‌వాడీలు, పాఠశాలలు, వసతిగృహాలు, ఆస్పత్రుల్లో గుడ్లు అందిస్తోంది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు, ఇంట్లోని వంటకాల్లో కూరలకు గుడ్లు విరివిగా వాడుతున్నారు. గుడ్డు భలే ఫుడ్ అన్నట్టుగా మారింది. డిమాండ్‌కు తగ్గట్టుగా గుడ్ల ఉత్పత్తి లేకపోవడంతో పాటు శీతాకాలం కావడంవల్ల వినియోగం పెరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు. కొన్నేళ్లుగా కోళ్ల పరిశ్రమ నష్టాల్లో కూరుకుపోగా ఇప్పుడు కాస్తంత పెరిగిన గుడ్డు ధర ఊరటనిస్తోందని పౌల్ట్రీ నిర్వాహకుడు తాడి శేషారెడ్డి తెలిపారు. కాసింత లాభాలు చూస్తున్నామన్నారు.



గతేడాది రూ.5.65

కార్తీకమాసంలో కాయగూరల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కనీసం గుడ్డు కొనుగోలు చేసి కూర వండుకుందామంటే బయట రూ.7 నుంచి రూ.7.50 వరకు విక్రయిస్తున్నారు. దీంతో గుడ్డు కూడా తినలేని పరిస్థితి నెలకొందని వినియోగదారులు వాపోతున్నారు. గతేడాది నవంబరులో గుడ్డు ధర రూ.5.65 ఉండగా ఇప్పుడు ఇదే మాసంలో రూ.6కి చేరింది. చిల్లరగా గుడ్డు ధర బయట మార్కెట్‌లో రూ.6.50 నుంచి రూ.7కు వరకు విక్రయిస్తున్నారు. మొత్తం మీద కార్తీకంలో గుడ్డు ధర నిర్వాహకులకు ఊరటనిస్తుంటే కొనుగోలుదారులకు మాత్రం నీరసం కలిగిస్తోంది.

రాయితీలు కల్పించాలి

పరిశ్రమలో కోళ్లకు వాడే మేతల ధరల పెరుగుదల, మందుల ధరలు పెరగడం భారంగా మారిందని నిర్వాహకులు చెబుతున్నారు. కోళ్ల మేతలకు సంబంధించి ముడిసరుకు ధరలు పెరగడం తమకు భారంగా మారాయని నిర్వాహకులు చెబుతున్నారు. 2019లో ముడిసరుకు ధరలు తక్కువ ఉండడం వల్ల లాభాలు వచ్చాయని అంటున్నారు. ఇప్పుడు పెరిగిన దాణాల ధరలు తమకు భారంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాలైన యూపీ, వెస్ట్ బెంగాల్, ఒడిస్సా తదితర రాష్ట్రాల్లో సబ్సిడీలు ఇస్తుండగా ఇక్కడ మాత్రం ఇవ్వడం లేదు. దానివల్ల ఇక్కడ రైతులు మార్కెట్ ధరపైనే ఆధారపడాల్సి వస్తోంది. పొరుగు రాష్ట్రాల్లా ఇక్కడా ప్రభుత్వం కోళ్ల పరిశ్రమలకు రాయితీలు కల్పించాలని, ముడిసరుకు ధరల నియంత్రణకు చర్యలు తీసుకుని ఆదుకోవాలని పౌల్ట్రీ నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వాకలపూడి ఐలా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్
వేదికపై ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం తదితరులు

పరిశ్రమలను ప్రోత్సహిస్తాం

ఐలా సమావేశంలో ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలను ప్రోత్సహించి, పారిశ్రామిక పార్కులు స్థాపించి యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్ అబ్బిరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ వాకలపూడి ఐడీఏ ఓఎన్‌జీసీ కార్యాలయంలో పారిశ్రామిక ప్రాంత స్థానిక ప్రాధికార సంస్థ (ఐలా) సొసైటీ సభ్యుల సాధారణ సమావేశంలో మాట్లాడారు. పరిశ్రమల అభివృద్ధి, విస్తరణ, ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయాలు, రాయితీ, పథకాలు, ఐలా ప్రాంతంలో ఉన్న పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై చర్చించేందుకు ఏర్పాటు చేసిన సమావేశానికి పరిశ్రమల ప్రతినిధులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడం ఆక్షేపించారు. ఐలా వాకలపూడి పరిధిలో 42 పరిశ్రమలు ఉంటే కేవలం 9 మంది ప్రతినిధులు,వీరిలో ముగ్గురు మేనేజర్ హోదాలో వచ్చారని, మిగతా వాళ్లు ఉద్యోగులు హాజరయ్యారన్నారు. నిర్వాహకుల సాధక బాధకాలు తెలుసుకుని, పరిశ్రమలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు సమావేశానికి వస్తే పారిశ్రామికవేత్తలు డుమ్మా కొట్టడం తగదని జడ్ఎం రమణారెడ్డి మండిపడ్డారు. పారిశ్రామిక తోడ్పాటు, మౌలిక సదుపాయాలు కల్పించాలన్న వాటిపై చర్చించేందుకు చక్కని వేదిక ఐలా సమావేశం అన్నారు. వాకలపూడిలో గల పరిశ్రమల నిర్వాహకులు సుమారు రూ.3.90 కోట్లు బకాయిలు పన్నులు రూపంలో చెల్లించాల్సి ఉందన్నారు. తక్షణమే ఈ టాక్స్ చెల్లిస్తే, మ్యాచింగ్ గ్రాంట్‌గా నిధులు జోడించి మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. అంతా సహకరించాలన్నారు. పారిశ్రామిక ప్రాంతంలో చోరీలు జరుగుతున్నాయని, మందుబాబులు మద్యం తాగి బాటిల్స్ రోడ్డు పక్కనే పడేస్తు న్నారని, వీధి దీపాలు సరిగ్గా వెలగకపోవడం, ఈస్ట్ కెనాల్ నుంచి నీరు బయటకు వెళ్లేం దుకు చర్యలు తీసుకోవాలని పరిశ్రమల ప్రతినిధులు కోరారు. రెండు రక్షక్ వాహనాల కొనుగోలుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని త్వరలో వీటిని పోలీస్ స్టేషన్లకు అనుసంధానం చేస్తామని ఎమ్మెల్యే పంతం నానాజీ హామీ ఇచ్చారు. ఐలా ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి, పురోగతి పనులపై జడ్ఎం రమణారెడ్డి చదివి వినిపించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, డీఐసీ జీఎం గణపతి ప్రసంగించారు. సమావేశంలో కూటమి నాయకులు పెంకే శ్రీనివాసబాబా, నులు కుర్తి వెంకటేశ్వరరావు, రంబాల వెంకటేశ్వర రావు, ఐలా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు
449 అర్జీలు

- కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ షాన్‌మోహన్



కలెక్టరేట్‌లో అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),నవంబరు 10(ఆంధ్రజ్యోతి):ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహిస్తుందన్నారు. అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. ఈ అర్జీలను జిల్లాస్థాయిలో ఆడిట్ చేసిన తర్వాత రాష్ట్రస్థాయిలో ఆడిట్ చేస్తారన్నారు. బియ్యం కార్డుల మంజూరు, కార్డుల్లో పేర్లు మార్పులు, చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, రీసర్వే, ఆక్రమణల తొలగింపు, డ్రైన్లు కాలువల్లో పూడిక తొలగింపు వంటి వాటికి సంబంధించి 449 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ మనీషా, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, సీపీవో త్రినాథ్, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీధర్, కేఆర్ఆర్సీ ఎస్డీసీ రత్నమణి, డీపీవో రవికుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 53 అర్జీలు

కాకినాడక్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో బాధపడుతూ స్థానికంగా పరిష్కారం కాక జిల్లావ్యాప్తంగా 53మంది అర్జీదారులు సోమవారం ఎస్పీ జి.బిందుమాధవ్ నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. ఈసందర్భంగా ఎస్పీ అర్జీదారులసమక్షంలోనే సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి అర్జీదారుల ఫిర్యాదులు సమ్మతమైనవైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో 23 భూతగదాలు, 9 కుటుంబ కలహాలు, 21 వివిధ కేసులకు సంబంధించినవి ఉన్నాయి.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఏడు రోజుల లోపు విచారణ పూర్తి చేసి తగిన పరిష్కారం చూపాలన్నారు. చర్యల వివరాలను జిల్లా పోలీస్ కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని ఫిర్యాదుదారులు సంబంధిత పోలీస్‌స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాల్లోను, సబ్ డివిజన్ కార్యాలయాల్లోను ఫిర్యాదు చేయవచ్చన్నారు. వాటిని పోలీస్ గ్రీవెన్స్‌గానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ భరోసా ఇచ్చారు.



జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్జీదారుల గోడు వింటున్న ఎస్పీ బిందుమాధవ్

నేటి నుంచి ఉప్పాడ రైల్వేగేటు మూసివేత



రైల్వేగేటు మూసివేస్తున్నట్లు ఏర్పాటు చేసిన బోర్డు

- 15 వరకూ మరమ్మతుల నిర్వహణ
- ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలి

పిఠాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగించే పిఠాపురం పట్టణ శివారులోని ఉప్పాడ రైల్వేగేటును మంగళవారం నుంచి మూసివేయనున్నారు. ఈనెల 15వ తేదీ వరకూ మరమ్మతుల కారణంగా ఈ గేటును మూసివేస్తున్నట్టు రైల్వే అధికారులు ప్రకటించారు. పట్టణ శివారులో ఉన్న ఉప్పాడ రైల్వే గేటు ఇటీవలకాలంలో తరచూ మొరాయిస్తోంది. గేటు మరమ్మతులతోపాటు అక్కడ ఉన్న ట్రాక్ మెయింటెనెన్స్ నిమిత్తం గేటును ఈ నెల 11వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 15వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ మూసివేయాలని నిర్ణయించారు. ఈ సమయంలో రైల్వే ఇంజనీరింగ్ అధికారులు మరమ్మతులు పూర్తి చేస్తారు. పిఠాపురం నుంచి పట్టణ శివారులోని డ్రైవర్స్‌కాలనీ, మండలంలోని నవఖండ్రవాడ, కొత్తపల్లి మండలంలోని గ్రామాలు, బీచ్ రోడ్డుకు రాకపోకలు సాగించే అన్నిరకాల వాహనాలు ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించాలని రైల్వే అధికారులు సూచించారు. పూర్వ గోర్స రైల్వేగేటు వద్ద ఉన్న రైల్వే అండర్‌పాస్ బ్రిడ్జి ద్వారా రైల్వేస్టేషన్ వెనుక వైపున ఉన్న రోడ్డులో రాకపోకలు సాగించాలని కోరారు. ఇప్పటికే ఆర్‌యూబీ రహదారి అధ్వానంగా మారడంతో వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పుడు ఉప్పాడ రోడ్డులోని వాహనాలన్నీ ఇటువైపు నుంచే వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు తప్పవని ప్రజలు చెబుతున్నారు.



ప్రథమ బహుమతి పొందిన గైగోలుపాడు యూపీహెచ్‌సీ

ఆరోగ్య కేంద్రాలకు
అవార్డులు

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పరిధిలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రం, గ్రామ ఆరోగ్య వెల్‌నెస్ కేంద్రాల పనితీరుకు అవార్డులు, నగదు పురస్కారాలు లభించినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాయకల్ప కార్యక్రమంలో భాగంగా రాష్ట్రప్రభుత్వ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్, జాతీయ ఆరోగ్య కమిషన్, రాష్ట్ర వైద్య ఆరోగ్య నాణ్యతా ప్రమాణ విభాగం, కాకినాడ జిల్లా పరిధిలో ఉత్తమ నాణ్యతా ప్రమాణాలు, సూచికల ప్రకారం ఉత్తమ వైద్య ఆరోగ్య సేవలు అందించిన 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక పట్టణ ఆరోగ్య కేంద్రం, 3 గ్రామ ఆరోగ్య వెల్‌నెస్ కేంద్రాలకు అవార్డులు, నగర పురస్కారానికి ఎంపిక కావడం జరిగిందని డీఎంహెచ్‌వో తెలిపారు. వాటిలో మల్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మొదటి బహుమతితోపాటు రూ.1 లక్ష నగదు పురస్కారానికి ఎంపికైంది. అలాగే ఏవీ నగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వితీయ బహుమతి, రూ.50 వేల నగదు పురస్కారానికి ఎంపికైంది. విరవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తృతీయ బహుమతి, రూ.25 వేల నగదు పురస్కారానికి ఎంపికైంది. ఇక కాకినాడ జట్ల పెద్దకాపువీధి యూపీహెచ్‌సీకి ప్రథమ బహుమతితోపాటు రూ.1 లక్ష నగదు పురస్కారానికి ఎంపికైంది. జి.మామిడాడ గ్రామ ఆరోగ్య వెల్‌నెస్ కేంద్రం మొదటి బహుమతితోపాటు రూ.50 వేల నగదు పురస్కారానికి ఎంపికైంది. పెద్ద బ్రహ్మదేవం గ్రామ ఆరోగ్య వెల్‌నెస్ కేంద్రం ద్వితీయ బహుమతితోపాటు రూ.35 వేలు నగదు పురస్కారానికి ఎంపికైంది. అలాగే సర్పవరం గ్రామ ఆరోగ్య వెల్‌నెస్ కేంద్రం తృతీయ బహుమతితోపాటు రూ.25 వేల నగదు పురస్కారానికి ఎంపికైంది.

17 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం (లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపైన్) ఈ నెల 17నుంచి ఈనెల 30 వరకు నిర్వహించాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. ఈ మేరకు గోడపత్రికను కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో 14 రోజులపాటు ఈ సర్వే జరుగుతుందన్నారు. ప్రతిరోజూ ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు ఆశ, పురుష వలంటీర్లు గృహాలను సందర్శించి అనుమానాస్పద చర్మవ్యాధులను గుర్తించే ప్రక్రియ జరుగుతుందన్నారు. కేసులను నిర్ధారించడం వారికి ఉచితంగా మందులు, ఎండీటీ ట్రీట్‌మెంట్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ మందులు ప్రతి పీహెచ్‌సీలో, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఉచితంగా ఇస్తారన్నారు. ప్రాథమికంగా దాగిఉన్న అనుమానాస్పద మచ్చలను గుర్తించడం ద్వారా అంగవైకల్యం రాకుండా నివారించవచ్చునన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ మాట్లాడుతూ 2027 నాటికి కుష్టువ్యాధి లేకుండా చేయాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఈ క్యాంపైన్ నిర్వహిస్తోందన్నారు. ఇంటింటా సర్వేలో గుర్తించిన వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరించి వారికి మందులతోపాటు ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు ఇస్తారన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టరు చలమయ్య, ఫిజియోథెరపిస్ట్ డాక్టరు శ్రీనివాసరావు, డిప్యూటీ డెమో సూర్యచంద్రరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ షాన్‌మోహన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

'సైన్స్'ను విందాం.. కందాం!

- విద్యార్థులకు ఉపయుక్తంగా రాజమహేంద్రవరం ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం
- బొమ్మూరులో ఐదెకరాల స్థలంలో ఏర్పాటు
- ప్రపంచంలోని అనేక విషయాలపై పరిజ్ఞానం

6



సైన్స్‌ను.. విందాం.. కందాం!

అనంత విశ్వం, భూగోళం, ఖగోళం, సముద్రాల లోతు, ప్రపంచ దేశాలు, అక్కడి వాతావరణ పరిస్థితులు.. కొండలు, కోనలు.. జంతువులు, భూమి, నీరు, మంచు.. ఇలా ఒకటేమిటి ఒక్కసారిగా ప్రపంచంలోని అన్నింటి గురించి వినొచ్చు.. చూడొచ్చు.. అంటే ప్రపంచాన్నే చుట్టివచ్చేయొచ్చన్న మాట.. దీనికి ఎక్కడికో వెళ్లక్కర్లేదు. రాజమహేంద్రవరం సైన్స్ సెంటర్‌కి వెళ్తే చాలు.. ఇక్కడి గ్యాలరీల్లో వాటన్నింటినీ వర్చువల్‌గా చూడొచ్చు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల విద్యార్థులకు ఉపయోగపడేలా రాజమహేంద్రవరంలోని బొమ్మూరులో విజ్ఞాన కేంద్రం(సైన్స్ మ్యూజియం)ను నిర్మించారు.

అటు వినోదం.. ఇటు విజ్ఞానం

- విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా రాజమహేంద్రవరం ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం
- బొమ్మూరులో ఐదెకరాల స్థలంలో ఏర్పాటు
- ప్రపంచంలోని అనేక విషయాలపై పరిజ్ఞానం
- సైన్స్ సెంటర్‌కు తరలివస్తున్న విద్యార్థులు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రం(సైన్స్ మ్యూజియం) విద్యార్థులను బాగా ఆకర్షిస్తోంది. ప్రతిరోజూ ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలనుంచి విద్యార్థులు వచ్చి ఈ కేంద్రాన్ని సందర్శించి ఉత్సాహంతో వెళ్తున్నారు. విద్యార్థులు ప్రయోగాలు చేయడానికి అనుకూలమైన మ్యూజియంఇది. ఇక్కడ వినోదంతోపాటు విజ్ఞానం కూడా పొందవచ్చు. ఇక్కడ పెద్ద విజ్ఞాన పార్కు కూడా ఉండడంతో అందరూ సంతోషంగా ఆడుకుంటున్నారు. ఈ ప్రాంతీయ విజ్ఞాన కేంద్రాన్ని గత జూన్ 26న కేంద్రమంత్రి షెకావత్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రారంభించగా ఎంపీ పురందేశ్వరి, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు. సైన్సు సెంటర్‌పై మొదట్లో అంతగా ప్రచారం లేక ప్రజల్లోకి అంతగా వెళ్లలేదు. ఇటీవల దీనిపై అవగాహన పెరగడంతో తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని పాఠశాలలు, కళాశాలల నుంచి ప్రతిరోజూ ఏదో పాఠశాలనుంచి విద్యార్థులు వస్తున్నారు. ఇక్కడ ఉండే వాటిపై పూర్తిగా వివరించి చెప్పేవారు ఉంటే విద్యార్థులకు మరింత ఉపయుక్తంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



ఎన్నెన్నో వింతలు

ఈ విజ్ఞాన కేంద్రాన్ని ఐదెకరాల స్థలంలో రూ.10 కోట్లతో నిర్మించారు. ఈ సైన్స్ కేంద్రం ఓఅద్భుతం..సైన్స్ పరికరాలు,జ్ఞాన సమాచారం.. ప్రయోగశాలలు ఏర్పాటుచేశారు. ఈ భవనాన్ని జీప్లస్ -1గా నిర్మించారు.గ్రౌండ్ ఫ్లోర్‌లో మూడు రూమ్‌లున్నాయి. ఫస్ట్ ఫ్లోర్‌లో ఆరు గ్యాలరీలున్నాయి. ఆడిటోరియం, కాన్ఫరెన్స్ హాల్ ఉంది. సాంకేతికపరమైన 18ఎగ్జిబిషన్లుఉన్నాయి. ఓపెన్ గ్రౌండ్‌లో సైన్స్ పార్కు ఉంది. రస్నియాన్స్ గ్యాలరీలో ఫిజిక్స్, మాథ్స్‌కి సంబంధించిన 33 విజ్ఞాన అంశాలు ఉన్నాయి. అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ కోసం మరో నిర్మాణం కూడా చేయనున్నారు. వాటర్ వ్రీస్ గ్యాలరీలో వర్చువల్ మ్యూజియం, మరో 35ఎగ్జిబిషన్లు ఉన్నాయి.సౌండ్, చిత్రాల సేకరణ, ఖగోళ వస్తువులు, సాంకేతిక,శాస్త్రీయ, పారిశ్రామిక పురోగతికి సంబంధించిన 32 ప్యానెళ్లు ఉన్నాయి. ఎర్నీ విత్ లైట్ బై స్పేస్, గెలాక్సీ గ్రహాలతో కూడిన 20 ప్యానెల్స్ ఉన్నాయి.



పలు అంశాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు



ఏపీసీఓఎస్‌టీ నిర్వహణలో..

కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియంలోని ఒక యూనిట్ అయిన విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియం, స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ కల్చర్ ఆఫ్ సైన్స్(ఎస్‌పీవోసీఎస్) పథకం కింద ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఏపీసీవోఎస్‌టీ) ఆధ్వర్యంలో దీన్ని నిర్మించారు. ప్రస్తుతం ఇది ఏపీసీఓఎస్‌టీ ఆధ్వర్యంలో నిర్వహణలో ఉంది.

రోజూ సందడి

విద్యార్థులతో ఇక్కడ రోజూ సందడిగానే ఉంటుంది. జూన్‌నుంచి ఇప్పటివరకూ 25వేలమందికిపైగా ఈ కేంద్రాన్ని సందర్శించినట్లు ఇక్కడ ఇన్‌చార్జి అయిన డీఈవో ఎం.దుర్గాప్రసాద్ నాయక్ తెలిపారు. మ్యూజియం కోఆర్డినేటర్‌గా ఓ డీఈవో అధికారి ఉన్నారు. ఆయనతో పాటు మరో ముగ్గురు డీఈవోలుకూడా ఉన్నారు. వీరే ఎడ్యుకేషనల్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తున్నారు

- **ప్రతి సోమవారం సెలవు**

ఈసైన్స్ మ్యూజియం ప్రతిరోజూ ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుంది. ప్రతి సోమవారం సెలవు.

- **టికెట్ వివరాలు**

పాఠశాల విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.25, ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు రూ.40, ప్రైవేట్ స్కూల్ విద్యార్థులకు రూ.40, కాలేజీ విద్యార్థులకు రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రజలకు కూడా అనుమతి ఉంది. పెద్దలకు రూ.50, పిల్లలకు ఒక్కొక్కరికి రూ.25 వంతున వసూలు చేస్తున్నారు.

- **ఇలా వెళ్లాలి..**



సైన్స్ సెంటర్‌కు రాజమహేంద్రవరం నుంచి మోరంపూడి హైవే మీదుగా బొమ్మూరు వద్ద రాజవోలు మార్గంలో లోపలికి వెళ్లాలి.



సౌండ్‌పై అవగాహన పొందుతున్న విద్యార్థులు



మంచుకొండలపై ఉండే పరిస్థితులు తెలిసేలా చేసిన ఏర్పాటు



కరప మండలం వాకాడలోని రామాలయం ఆవరణలో రెండు భారీ టవర్ ఆకృతులపై ఆకట్టుకుంటున్న దీపాల వరుస





దీపాలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే నానాజీ, యువతులు

కనుల పండువగా..
కోటి దీపాల సంబరం!

- కరప మండలం వాకాడలో ఘనంగా నిర్వహణ
- రెండు భారీ టవర్ ఆకృతులపై దీపాలు వెలిగించిన మహిళలు

కరప, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వాకాడలో సోమవారం రాత్రి కోటి దీపాల సంబరం ఘనంగా జరిగింది. రామాలయం ఆవరణలో కర్రలు, చెక్కలతో రెండు భారీ టవర్ ఆకృతులను నిర్మించారు. వాటి మధ్య అరల్లో మట్టి ప్రమిదలను ఉంచి వాటిలో నూనె పోసి తెల్లవార్లు కోటి దీపాలను వెలిగించారు. సంబరానికి విచ్చేసిన మహిళలు ఒత్తులను వెలిగించి పూజలు చేశారు. నిర్వాహకులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసి సంబరాన్ని రక్తికట్టించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిమంది తరలివచ్చి తిలకించారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కరప ఎస్ఐ తోట సునీత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, వేములవాడ సొసైటీ ఛైర్మన్ దూడల నారాయుడు, సర్పంచ్ ఆడబాల సత్యప్రసాద్, ఆయా పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు కార్తీక దామోదరుడిని దర్శించుకుని భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించారు.





ఆలయ ఆవరణలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్న కళాకారులు

జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో
రంగంపేట విద్యార్థినులకు రజత పతకం

రంగంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో తూర్పుగోదావరి జిల్లా రంగంపేట జడ్పీ హైస్కూలు విద్యార్థినులు రజత పతకం సాధించారని ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి సోమవారం తెలిపారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఎన్‌వోఎస్‌టీసీ (ఢిల్లీ) ఆధ్వర్యంలో ఇండియన్ యంగ్ ఇన్నోవేటర్స్ అండ్ ఇన్వెన్షన్ చాలెంజ్ పేరిట నిర్వహించిన జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రాజెక్టుల ప్రదర్శన, పోటీలో దేశవ్యాప్తంగా 70 ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ఇందులో రంగంపేట విద్యార్థినులు బి.పల్లవి, ఎం.జాహ్నవి రూపొందించిన బయోమెట్రిక్ మెషీన్ కూడా ఉంది. దీనికి రజత పతకం దక్కింది. విద్యార్థినులతో పాటు వారికి గైడ్‌గా వ్యవహరించిన జీవశాస్త్ర ఉపాధ్యాయిని వి.రమ్యసుధను ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, పి.మధుసూదనరావు, హెచ్ఎం పార్థసారథి, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థినులను, ఉపాధ్యాయిని రమ్యసుధను అభినందిస్తున్న హెచ్ఎం పార్థసారథి

జాతీయ స్థాయి స్క్వాష్ పోటీలకు 'ఆదిత్య' విద్యార్థినుల ఎంపిక

కాకినాడ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆదిత్య శ్రీనగర్ పాఠశాల 10వ తరగతి విద్యార్థిని నడింపల్లి రూపశ్రీ, 8వ తరగతి విద్యార్థిని పిల్లా బ్లెస్సీ షానోన్ జాతీయ స్థాయి స్క్వాష్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ టి.రమేష్ తెలిపారు. న్యూఢిల్లీలోని త్యాగరాజు మైదానంలో వచ్చే ఏడాది జనవరి 10 నుంచి 15వ తేదీ వరకు జరిగే పోటీల్లో వారు పాల్గొంటారని ఆయన చెప్పారు. ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ శృతిరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. క్రీడాకారిణిలను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, ప్రిన్సిపాల్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ విజయఉమాపతి అభినందించారు.





రూపశ్రీ, బ్లెస్సీ షానోన్





రష్యన్ హౌస్‌లో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తమన్నా... విద్యార్థిని అభినందించి ప్రశంసాపత్రం అందజేస్తున్న రష్యా శాస్త్రవేత్త ఓల్గా గాబ్రియేల్

జాతీయ స్థాయి సైన్స్ సెమినార్‌లో సామర్లకోట విద్యార్థిని తమన్నా

సామర్లకోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి ఎక్స్‌ప్లోర్ సైన్స్ సెమినార్‌లో కాకినాడ జిల్లా సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని ఎండీ తమన్నా కాటూన్ సత్తా చాటిందని సామర్లకోట ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పట్టపగలు పుల్లయ్య పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 52 మంది విద్యార్థులు ఎంపిక కాగా కాకినాడ జిల్లా నుంచి తమన్నా మాత్రమే ఉందన్నారు. ఆమెకు న్యూఢిల్లీలోని రాకెట్ ఇంజనీరింగ్ కళాశాల, రష్యన్ హౌస్, రాష్ట్రపతి భవన్, నెహ్రూ ప్లానిటోరియం, నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్, నేషనల్ మ్యూజియం చూపించారు. కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తమన్నాకు బహుమతి, ప్రశంసాపత్రం అందజేశారు. సోమవారం సామర్లకోట చేరుకున్న విద్యార్థిని ఎంఈవోలు, ఉపాధ్యాయులు అభినందించారు.

శంభో హరహర నమో నమో

శివశివ శంకర భక్తవశంకర శంభో హర హర నమోనమో అంటూ భక్తులు కైలాసవాసుడిని దర్శించుకుని పరవశులయ్యారు. కార్తీక మాసం మూడో సోమవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునే ఆలయాలకు వెళ్లి క్యూలైన్లలో బారులు తీరి శివుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం జాంపేట ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో శివుడే ప్రత్యక్షమైనట్టుగా స్వామికి విశేష అలంకరణ



కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడలో భస్మాభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరస్వామి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మురమళ్లలో వీరేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామికి అన్నాభిషేకం



కాకినాడ భానుగుడిలోని అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో స్ఫటిక లింగానికి అభిషేకం చేస్తున్న భక్తురాలు



కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు



కాకినాడ జిల్లా సామర్లకోటలో కుమారరామ భీమేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న అర్చకులు

మరణం ముంగిట మహోపకారం!

- కాలేజీ బస్సు డ్రైవర్‌కు గుండెపోటు
- బస్సును పక్కకు ఆపి క్షణాల్లో మృతి
- 50మంది విద్యార్థులు సురక్షితం

ఆలమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాలేజీ బస్సు డ్రైవర్‌కు ఆకస్మికంగా గుండెపోటు వచ్చింది. అయితే ఆ క్షణం తన కోసం కాకుండా విద్యార్థులను రక్షించాలనే ఆలోచనతో బస్సును పక్కకు ఆపి మరుక్షణం స్టీరింగ్‌పై వాలి డ్రైవర్ ప్రాణాలు వదిలాడు. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మడికి వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళ్లితే.. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీ బస్సు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం గంటి నుంచి బయలుదేరింది. రాజమహేంద్రవరానికి 50మంది విద్యార్థులను ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన దెందుకూరి నారాయణరాజు (60) అనే డ్రైవర్ తీసుకువెళుతున్నారు. మడికి దాడిన వెంటనే డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో తక్షణం బస్సును పక్కకు ఆపి స్టీరింగ్‌పై పడిపోయాడు. దీంతో విద్యార్థులు ఒక్కసారిగా భయభ్రాంతులై బస్సు నుంచి దిగిపోయారు. వెంటనే నారాయణ రాజుకు సీఎంఆర్ చేసి అంబులెన్స్‌కు ఫోన్ చేయగా అప్పటికే ప్రాణాలు విడిచినట్టు స్థానికులు చెప్తున్నారు. తాను చనిపోతూ 50మంది విద్యార్థులకు చిన్నపాటి హాని జరగకుండా చేసిన డ్రైవర్ నారాయణరాజుకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రాణాలు వదిలిన డ్రైవర్ నారాయణరాజు



ఆలమూరు మండలం మడికి వద్ద జాతీయ రహదారిపై ఆపివేసిన బస్సు

క్యారేజీ తీసుకున్న 5 నిమిషాలకే..

దాదాపు 40ఏళ్లుగా డ్రైవర్ వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న నారాయణరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నారాయణరాజు ప్రతీ రోజు ఉదయమే క్యారేజీ పట్టుకుని డ్రైవింగ్‌కు వెళ్తాడు. సోమవారం ఉదయం అతడు బయలు దేరే సమయానికి వంట పూర్తి కాకపోవడంతో తాను రోడ్డుమీదకు తీసుకొచ్చి క్యారేజీ అందిస్తానని భార్య చెప్పడంతో నారాయణరాజు వెళ్లిపోయ్యాడు. గంటి బయలుదేరి వచ్చి మడికి వద్ద భార్య చేతులమీదుగా క్యారేజీ తీసుకున్న ఐదు నిమిషాల వ్యవధిలోనే గుండెపోటు వచ్చిన భర్త చనిపోవడంతో భార్య బేబి బోరున విలపిస్తుంది.

రద్దీగా రత్నగిరి...

- కార్తీక సోమవారం 8645 వ్రతాలు
- రూ.80 లక్షల ఆదాయం

అన్నవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి కార్తీక సోమవారం పర్వదినం పురస్కరించుకుని భక్తజనంతో నిండిపోయింది. రద్దీ నేపథ్యంలో ఒంటిగంట నుంచి వ్రతాలు, 2గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఒక్కరోజు 8645 జంటలు వ్రతాలు ఆచరించుకోగా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.85 లక్షల ఆదాయం ఆలయానికి లభించింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ వేర్వేరు ప్రదేశాల్లో ఉండి పర్యవేక్షణ చేస్తూ ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం మహిళా భక్తులు రావిచెట్టు వద్ద కార్తీకదీపాలు వెలిగించారు. సత్యదేవ నిత్యాన్నదాన పథకం ద్వారా 30 వేలమందికి నిరంతరాయంగా ఉచిత పులిహోర పంపిణీ చేశారు.

ప్రతాలు ఆచరిస్తున్న భక్తులు





పీఠాధిపతికి వేదాశీర్వచనం అందిస్తున్న పండితులు

పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పూజలు

సత్యదేవుడి సన్నిధిలో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి శ్రీ ప్రజానంద సరస్వతి బాలాజీ స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

రూ.లక్ష విరాళం

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి వీరంపాలెనికి చెందిన బొల్లారెడ్డి రామకృష్ణారెడ్డి రూ.లక్ష విరాళాన్ని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి వారికి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యాలు కల్పించారు.



కాలేజీ నుంచి ఇంటికెళ్తుండగా...

బస్సు ఢీకొని విద్యార్థి మృతి



శంకర్ (ఫైల్)

కాకినాడ క్రైం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ కళాశాల బస్సు ఢీకొని అదే కళాశాలకు చెందిన విద్యార్థి దుర్మరణం చెందిన సంఘటన సోమవారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాకినాడ దుమ్ములపేటకు చెందిన కంబాల యువన్ శంకర్ (17) స్థానిక పోస్టల్‌కాలనీలో ఉన్న శ్రీచైతన్య క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. అతడి తండ్రి మల్లేశ్వరరావు చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. అయితే శంకర్ సోమవారం సాయంత్రం కళాశాల ముగిశాక 5.50 గంటలకు తన స్కూటీపై స్నేహితుడైన మోజస్‌ను ఎక్కించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో సాంబమూర్తినగర్ 5వ వీధి ఆదిత్య ఉమెన్స్ డిగ్రీ కళాశాల సమీపంలోకి వచ్చేసరికి స్కూటీ అదుపు తప్పడంతో మోజస్ ఎడమపక్కకు పడిపోగా, శంకర్ కుడి పక్కకు పడిపోయాడు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న కళాశాల బస్సు టైర్ శంకర్ ఛాతీపైకి ఎక్కడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. వెంటనే మోజస్ స్థానికుల సహాయంతో జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు జీజీహెచ్ అత్యవసర విభాగ వైద్యులు తెలిపారు. కాకినాడ త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిచ్చికుక్క ఎంత పనిచేసింది!

దాడిలో మూడేళ్ల బాలుడికి గాయాలు

చికిత్స పొందుతూ మృతి



భరత్ (ఫైల్)

గొల్లప్రోలు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బయట ఆడుకుంటున్న మూడేళ్ల చిన్నారిపై పిచ్చి కుక్క దాడి చేసి విచక్షణారహితంగా గాయపరిచింది. చికిత్స చేయించారు. మళ్లీ అకస్మాత్తుగా అస్వస్థతకు గురికావడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చేర్పగా సోమవారం మరణించాడు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ కొలిపే బుల్లబ్బాయి మనుమడు, నాగేశ్వరరావు రత్నశ్రీ దంపతుల ఏకైక కుమారుడు అయిన భరత్(3) అక్టోబరు 16న ఇంటి బయట ఆడుకుంటున్నాడు. ఆ సమయం లో పిచ్చికుక్క దాడి చేసి విచక్షణారహితంగా కరిచింది. ఈ దాడిలో గాయపడ్డ భరత్‌ను ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లి ఏఆర్‌వీ ఇంజక్షన్లతో పాటు చికిత్స చేయించారు. కోలుకుంటున్న తరుణంలో ఆదివారం మళ్లీ అస్వస్థతకు గురికాగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మరణించాడు. తమ ఏకైక కుమారుడు పిచ్చికుక్క దాడిలో గాయపడి మరణించడంతో నాగేశ్వరరావు, రత్నశ్రీ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ముక్కుపచ్చలారని బాబు మరణించడాన్ని వారితో పాటు గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు.

నివారణ చర్యలు ఏవి..?

గ్రామంలో కొంతకాలంగా పిచ్చికుక్కల బెడద అధికంగా ఉంది. బాలుడిని కరిచి గాయపరిచిన కుక్క 2రోజుల వ్యవధిలో పలువురిని గాయపరిచింది. వీరంతా పెద్దవారు కావడంతో చికిత్స పొంది కోలుకున్నారు. ఆ పిచ్చికుక్కను గ్రామస్తులు కొట్టి చంపివేశారు. అయితే 2 కొద్దిరోజులుగా కుక్కలు పలువురిని గాయపరుస్తున్నాయి. వీటిని నియంత్రణకు పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కుక్కలను నియంత్రించి ఉంటే బాలుడు బతికి ఉండేవాడని పేర్కొంటున్నారు.

ప్రతీ రైతుకు అండగా ప్రభుత్వం

శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు



అనపర్తి మండలం కుతుకులూరులో ప్రసంగిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

అనపర్తి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. సోమవారం తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కుతుకులూరు సొసైటీ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డితో కలిసి ప్రారంభించారు. యంత్రం ద్వారా తేమ కొలిచే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 3217 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం కాగా ఇప్పటికే 1612 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 46మండలాల్లో 20137 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ప్రతీ రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని, పంట నష్టం అంచనా వేసేందుకు కేంద్ర బృందాలు పర్యటించనున్నాయని నివేదిక అందిన వెంటనే కేంద్రం సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం ప్రకటిస్తుందన్నారు. టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుగ సూర్యకుమారి, ఆళ్ళ గోవిందు, కర్రి శేషారత్నం, కర్రి సత్యగౌరి, బేరా వేణమ్మ, సొసైటీ చైర్మన్లు నల్లమిల్లి సుబ్బారెడ్డి, దత్తుడు శ్రీను, కరకుదురు దత్తుడు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమవ్వాలి

పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకి యోగ్యమైన కేసులు పెద్ద సంఖ్యలో పరిష్కారం కావాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. డిసెంబరు 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ని పురస్కరించుకుని న్యాయమూర్తులతో సోమవారం ఆమె సమావేశమయ్యారు. కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలని సూచించారు. అనంతరం ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలిచ్చారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మీ, నాలుగు జిల్లాల ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులకు సూచనలు ఇస్తున్న పీడీజే గంధం సునీత

కందరాడలో భారీ వృక్షానికి మంటలు

భయాందోళనకు గురైన ప్రజలు

పిఠాపురం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కందరాడ గ్రామంలో భారీ వృక్షానికి అకస్మాత్తుగా మంటలు అంటుకున్నాయి. దీంతో ఆ మార్గంలో వెళ్లే ప్రజలు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో గల ప్రైవేటు పాఠశాల ఎదురుగా ఉన్న భారీ వృక్షం మీదుగా కరెంటు తీగలు వెళ్తున్నాయి. అవి షార్ట్‌సర్క్యూట్ అవ్వడంతో మంటలు చెలరేగాయి. దీంతో పిఠాపురం-సామర్లకోట ఆర్‌అండ్‌బీ రహదారిపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పిఠాపురం రూరల్ ఎస్ఐ జానీబాషా అక్కడకు చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. వాహనాలను ఎస్సీ కాలనీలోని రహదారుల మీదుగా మళ్లించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు.



కందరాడలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో భారీ వృక్షానికి అంటుకున్న మంటలు

షేక్ సుభానీకి రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయ అవార్డు



షేక్ సుభానీ

మామిడికుదురు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు జడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ షేక్ సుభానీ ఎంపికయ్యారు. మౌలానా అబుల్‌కలాం అజాద్ జయంతిని పురస్కరించుకుని ఈ అవార్డుకు సుభానీని రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఎంపిక చేసింది. మంగళవారం అబుల్‌కలాం అజాద్ జయంతిని పురస్కరించుకుని విజయవాడలో జరిగే కార్యక్రమంలో అవార్డును అందిస్తారని ప్రధానోపాధ్యాయుడు బి.చిరంజీవిరావు తెలిపారు. సుభానీని ఇతర ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

మొక్కు తీర్చుకుని వచ్చేలోపు చీరతో ఉరేసుకుని..

కాకినాడలో యువకుడి ఆత్మహత్య



రాజు (ఫైల్)

కాకినాడ క్రైం, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం కాకినాడలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. కాకి నాడ జగన్నాధపురం నర్సింహ రోడ్డు పూర్వం వారి వీధికి చెందిన దండుప్రోలు రాజు (21) రెండేళ్ల వయస్సులోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అప్పటి నుంచి నానమ్మ శుభ వద్దనే పెరిగాడు. ప్రస్తుతం డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. రాజు గత మూడేళ్లుగా తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెం దిన ఓ యువతిని ప్రేమించాడు. ఇటీవల వారిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో మనస్తాపానికి గురై 10 రోజుల క్రితం ఎలుకల మందు తాగాడు. అయితే కుటుంబీకులు సకాలంలో ఆసుపత్రిలో చేర్పడంతో ప్రాణాపాయం తప్పింది. రాజు బాగుంటే కోటిపల్లి శివాలయానికి వస్తామని నానమ్మ, మేనత్త మొక్కుకున్నారు. సోమవారం రాజును ఇంటిలో ఉంచి మొక్కు తీర్చుకునేందుకు వెళ్లారు. మొక్కు తీర్చుకుని సాయంత్రం వచ్చి చూసేసరికి రాజు ఇంటి దూలానికి చీరతో ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సోమవరం కారు ప్రమాద ఘటనలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

మరో వ్యక్తి పరిస్థితి విషమం

కిర్లంపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవరం గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఈనెల 8న పెళ్లికారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. ముగ్గురు గాయపడ్డారు. గాయపడ్డ ముగ్గురిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. అందులో జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామానికి చెందిన విద్యార్థి కూండ్రపు దుర్గచైతన్య చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్టు కిర్లంపూడి పోలీసులు తెలిపారు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య నాలుగుకు పెరిగింది. అలాగే మరో వ్యక్తి భద్రం పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

అమలాపురంలో బాలిక కిడ్నాప్

కాకినాడ తీసుకెళ్లినట్టు గుర్తింపు

అమలాపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఐమెండ్ స్కూల్‌లో ఐదోతరగతి చదువుతున్న పదేళ్ల బాలిక సోమవారం సాయంత్రం కిడ్నాప్‌కు గురైన విషయం సంచలనంగా మారింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు స్కూలులో వైసీపీ నాయకుడు కముజు రమణ కుమార్తె నిషిత (10) కిడ్నాప్ అయినట్టు పట్టణ పోలీసులకు సమాచారం అందింది. బాలికకు వరుసకు మేనమామ అయ్యే మట్టపర్తి మధు అనే వ్యక్తి సోమవారం సాయంత్రం స్కూలు వద్దకు వచ్చి బాలికను ఇంటికి తీసుకెళ్తానని చెప్పి మోటారుసైకిల్ ఎక్కించుకుని వెళ్లినట్టు స్థానికులు తెలిపారు. తన కుమార్తె ఇంకా ఇంటికి చేరలేదని విచారించగా మట్టపర్తి మధు స్కూలుకు వెళ్లి తీసుకెళ్లినట్టు తెలిసిందని కముజు రమణ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ వీరబాబు అప్రమత్తమై విచారణ చేపట్టారు. కముజు రమణకు ఇద్దరు కుమార్తెల్లో చిన్న కుమార్తె నిషితను సమీప బంధువుగా పేర్కొంటున్న మట్టపర్తి మధు మోటార్‌సైకిల్ ఎక్కించుకుని కాకినాడ వెళ్లినట్టు ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. కాకినాడలోని మొబైల్ షాపులో కొత్త ఫోన్, సిమ్ కొనుగోలు చేస్తున్న సమయంలో బాలిక ఏడవడంతో మధు ఫోన్‌తో పాటు సిమ్‌కార్డును వదిలి బాలికను తీసుకుని పరారైనట్టు పోలీసులకు ప్రాథమికంగా సమాచారం అందింది. దీంతో కాకినాడ, అమలాపురం నుంచి పోలీసు బృందాలు బాలిక ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టాయి.

సెంట్రల్ జైలులో ఇద్దరు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష

ఆమోదం తెలిపిన క్యాబినెట్

రాజమహేంద్రవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అర్హులైన జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించింది. సోమవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో 27వ అంశంగా హోంశాఖలోని జైళ్లశాఖ చెందిన అంశాన్ని ప్రవేశపెట్టారు. దీనిలో ముగ్గురు జీవిత ఖైదీలకు క్షమాభిక్ష కల్పించాల్సి ఉంది. దీనికి జీవో ఎంఎస్ నెం.71 నిర్దేశించిన ప్రకారం మంత్రి మండలి ఆమోదం తెలిపింది. దీనిలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సెంట్రల్‌లో జీవిత ఖైదు అనుభవిస్తున్న మధిరి సువర్ణరాజు, కటికిరెడ్డి నాగేశ్వరరావు విడుదల కానున్నారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలేనికి చెందిన నాగేశ్వరరావు ఓ రైస్ మిల్లులో పని చేస్తుండేవాడు. కలెక్షన్ ఏజెంట్‌ను హత్య చేసి సొమ్ము దోపిడీ చేశారనే నేరంపై రాజమండ్రిలోని కోర్టు జీవిత ఖైదు విధించగా 2011 మార్చి 21న జైలుకు వచ్చాడు. ఇతడు ఇప్పటి వరకూ పర్లో, పేరోల్‌పై బయటకు కూడా వెళ్లలేదు. అలాగే కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం చంద్రాల గ్రామానికి చెందిన మదిరి సువర్ణరాజు భార్యను హత్య చేసిన కేసులో 2010 జూలై 15 నుంచి జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. ఇతడి ప్రవర్తన ఆధారంగా సెమీ ఓపెన్ ఎయిర్ జైలు అర్హత పొందాడు. అయితే ప్రభుత్వం జీవో 2రోజుల్లో ఇచ్చే అవకాశం ఉంది. ఆ జీవో ఆధారంగా వీళ్లిద్దరూ స్వేచ్ఛా వాయువులు పీల్చుకొని కుటుంబాల చెంతకు చేరనున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

గోకవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.15,000 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి తీర్పు వెలువరించినట్టు ఎస్ఐ పి.పవన్‌కుమార్ తెలిపారు. గోకవరం మండలం బావాజీపేటకి చెందిన విరోతి శ్రీను భార్యతో అదే గ్రామానికి చెందిన బలిజ శ్రీను వివాహేతర సంబంధం ఏర్పరచుకున్నాడు. ఈ క్రమంలో విరోతి శ్రీను అడ్డును తొలగిం చుకోవాలనే ఉద్దేశంతో 2020 డిసెంబరు 30న తెల్లవారుజామున 5.30 గంటలకు పొలం పనుల నిమిత్తం బలిజ శ్రీను విరోతి శ్రీనును రంపయర్రంపాలెం తోటలోకి తీసు కెళ్లాడు. అక్కడ బండ రాయితో శ్రీనును తల పై కొట్టి హత్య చేశాడు. ఈ సంఘటనపై మృతుడి సోదరుడు విరోతి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో ఎస్ఐగా పని చేసిన పి.చెన్నారావు కేసు నమోదు చేయగా అప్పటి కోరుకొండ సీఐ పితాని.పవన్‌కుమార్‌రెడ్డి నిందితుడిని అరెస్ట్ చేసి కేసు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌సీటు దాఖలు చేశారు. తదనంతరం నేరం రుజువు కావడంతో బలిజ శ్రీనుకు జీవిత ఖైదు, రూ.15,000 జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి ఎం.మాధురి తీర్పు ఇచ్చినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

పుస్తెలతాడు చోరీ

కాట్రేనికోన, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కుండలేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన మహిళ మెడలోని 7 కాసుల బంగారు పుస్తెలతాడును బైక్‌పై వచ్చిన దుండగుడు లాక్కెళ్లాడు. నల్లజర్ల మండలం చోడవరం నుంచి ఆర్యవైశ్య సంఘం తరపున నలభై మంది బస్సులో వచ్చారు. పుష్కరఘాట్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఆగంతకుడు గుళ్ళపూడి రత్నకుమారి మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కుని పరారయ్యాడు. పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు.

కట్టమూరులో 5వేల మందికి అన్నదానం

పెద్దాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టమూరులో సప్తాహ మహోత్సవాల ముగింపు సందర్భంగా దబ్బలదిబ్బ కోదండ రామాలయం వద్ద సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. సుమారు 5వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు.

శివోహం... భక్తజన సందోహం

కార్తీక మాసం మూడో సోమవారం శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు


గొల్లప్రోలు మండలం దుర్గాడలో అపర్ణా సమేత నాగేశ్వర స్వామికి ప్రత్యేక అలంకారం

పిఠాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజాము మూడు గంటల నుంచే పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఆలయ ప్రాంగణంలోని తులసి చెట్టు వద్ద పూజలు జరిపారు. పుష్కరిణి వద్ద, ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామికి 21రకాల ద్రవ్యాలతో మహన్యాసపూర్వ ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. అభిషిక్తుడైన స్వామిని భక్తులు దర్శించుకున్నారు. కార్తీక సోమవారం నోము ఆచరించే భక్తులు ఉపవాసం ఉండి సాయంత్రం ఆలయంలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న నేపథ్యంలో పాదగయ క్షేత్రం మీదుగా రాకపోకలు నిలిపివేశారు. ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతించారు. మిగిలిన వాటిని విరవాడ రోడ్డు, బైపాస్ మీదుగా మళ్లించారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపర్తిలో అపర్ణా సమేత నాగేశ్వరస్వామి, చేబ్రోలులో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి, దుర్గాడలో పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. తాటిపర్తిలో నాగేశ్వరస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. దుర్గాడ శివాలయంలో రామలింగేశ్వరస్వామి, లలిత, ఉమాదేవి అమ్మవార్లను అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు విశేషంగా అలంకరించారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): నగరంలోని దేవాలయం వీధిలో గల పెద్ద శివాలయంలో భీమేశ్వరస్వామికి అభిషేకాలు, లక్ష బిల్వార్చన జరిపారు. స్వామివారు ఆవునేతి దీపాల వెలుగులో భక్తులకు దర్శనమిచ్చారు. భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామికి, భానుగుడి సెంటర్ రిజర్వు పోలీసులైన్ ఆవరణలోని అయ్యప్పస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన వారాహి దేవికి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. కాశీ నుంచి తీసుకొచ్చిన స్ఫటిక శివలింగానికి పండ్ల రసాలు, పంచామృతాలతో భక్తులే స్వయంగా అభిషేకాలు చేసుకుని తరించారు. రామారావుపేట శివాలయంలో స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. భానుగుడి సెంటర్లోని భానులింగేశ్వరస్వామి ఆలయ క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. సూర్యారావుపేటలో బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామికి, జగన్నాథపురంలో భీమేశ్వర స్వామికి, శ్రీనగర్, సాంబమూర్తినగర్ తదితర ప్రాంతాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

కరప (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. కరప శివాలయంలో పర్వతవర్ధినీ దేవి సమేత రామలింగేశ్వరస్వామికి ప్రధానార్చకుడు విలపర్తి శ్రీనివాస్, ఫణిరాజు అభిషేకాలు, విశిష్ట పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. చినమామిడాడ, కూరాడ, పెద్దాపురప్పాడు, పెనుగుదురు, అరట్లకట్ట, గొర్రిపూడి, వేళంగి, కొరుపల్లి, నడకుదురు, వాకాడ, వేములవాడ గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), సభ్యుల పర్యవేక్షణలో తెల్లవారుజామున గో పూజతో పూజలను ప్రారంభించారు. భీమేశ్వరస్వామికి విశేష అభిషేకాలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష పుష్పార్చన జరిపారు. స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. మధ్యాహ్నం జరిగిన లక్షపత్రి పూజలో అమ్మ శ్రీకాంత్‌శర్మ కుటుంబ సభ్యులు ఆశీనులయ్యారు. సాయంత్రం జరిగిన ఆకాశదీప, రాత్రి జరిగిన జ్యోతిర్లింగార్చన పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నిత్యాన్నదాన పథకంలో 900 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయం వెలుపల భీమేశ్వర అన్నదాన ట్రస్టు ప్రతినిధి బిక్కిన పరమేశ్వర సాయి సత్యనారాయణ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 600 మందికి అన్నప్రసాదం, రాత్రి 300 మందికి అల్పాహారం అందజేశారు.


తాళ్లరేవు మండలం పాత కోరింగలో కురంగేశ్వరస్వామికి భక్తుల ప్రత్యేక పూజలు

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): పాత కోరింగలోని కురంగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు కార్తీక నోములు నోచారు. అర్చకుడు కొత్తలంక సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు.

వికాసలో నేడు ఇంటర్వ్యూలు

కాకినాడ సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీఎల్ (స్మార్ట్ బ్రెయిన్స్) కంపెనీలో ఉద్యోగాలకు కాకినాడ వికాస కార్యాలయంలో సోమవారం జరిగిన ఇంటర్వ్యూలు మంగళవారం కూడా కొనసాగుతాయని ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు తెలిపారు. నెట్‌వర్క్ ఇంజనీర్, డెస్క్‌టాప్ ఇంజనీర్, ఎల్1 సపోర్ట్, డేటా సెంటర్ ఆపరేటర్ ఉద్యోగాలకు బీటెక్ (ఆల్ స్ట్రీమ్స్), బీసీఏ, ఎంసీఏ 2019 నుంచి 2025 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులన్నారు. ఎడ్యుకేషన్‌లో ఒక సంవత్సరం అంతరాయం ఉన్నా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన వారికి ఆరు నెలల ట్రైనింగ్‌లో ఏడాది ప్రాతిపదికన రూ.2.2 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు జీతం, అనంతరం రూ.3.5 లక్షల నుంచి రూ.3.8 లక్షల జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం ఉదయం 9 గంటలకు తమ కార్యాలయం వద్దకు సర్టిఫికెట్ల జెరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77993 76222 నెంబరులో సంప్రదించాలన్నారు.

'పీజీఆర్ఎస్ అర్జీలను తక్షణం పరిష్కరించాలి'

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శారదమ్మ గుడి సమీపంలో గల కార్పొరేషన్ కార్యాలయ సమావేశ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఇన్‌చార్జి కమిషనరు కేటీ సుధాకర్ పలు సమస్యలకు సంబంధించి అర్జీలు స్వీకరించారు. వాటి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను సుధాకర్ ఆదేశించారు. 'డయల్ యువర్ కమిషనరు'కు ఏడుగురు ఫోన్ చేసి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. డిప్యూటీ కమిషనరు కె.శ్రీనివాస్, ఎస్ఈ పి.వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, డీసీపీ కృష్ణారావు, టీపీఆర్వో శైలజ, మేనేజరు సీతారాం పాల్గొన్నారు.

పిఠాపురంలో 34 అర్జీలు

పిఠాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతబస్టాండు వద్ద గల పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 34 అర్జీలు అందాయి. ప్రజల నుంచి అందిన వినతులను పరిశీలించి సత్వరం పరిష్కరించాలని పాడా ఏపీడీ వసంతమాధవి సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట'


వాకలపూడి పారిశ్రామిక ప్రాంతంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

సర్పవరం జంక్షన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా మరింత అభివృద్ధి సాధించేందుకు సహకారం అందిస్తానని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. సోమవారం ఏపీఐఐసీ జోనల్ మేనేజరు అబ్బిరెడ్డి రమణారెడ్డి ఆధ్వర్యంలో వాకలపూడి ఇండస్ట్రియల్ పార్కు (ఐలా వాకలపూడి) రూ.1.79 కోట్ల ఐలా నిధులతో చేపట్టనున్న 8, 9 రోడ్ల మరమ్మతులు, పటిష్టత, సిమెంటు రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరంతో కలిసి నానాజీ శంకుస్థాపన చేశారు. 3వ రోడ్డులో డ్రైన్ పక్క గోడల ఎత్తు పెంపుదలతో పాటు వీధిలైట్ల రిపేర్లు, ఫీడర్ పిల్లర్ బాక్స్, ఎస్‌వీ ల్యాంప్ దీపాల పునరుద్ధరణ తదితర పనులకు శ్రీకారం చుట్టారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కూటమి నాయకులు కరెడ్ల గోవిందు, సోదె ముసలయ్య, గేదెల చిన్నారావు, రాందేవు సీతయ్యదొర, రంబాల వెంకటేశ్వరరావు, మాతా లక్ష్మణ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పిడుగు పాండురంగారావు, ఏపీఐఐసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి


అచ్చంపేట సెంటర్లో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వయం ఉపాధి శిక్షా సంస్థను ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

సర్పవరం జంక్షన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత నైపుణ్యాభి వృద్ధితో స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవడం ద్వారా విజయవంతమైన వ్యవస్థాపకులుగా మారవచ్చని కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. కాకినాడ రూరల్ అచ్చంపేట సెంటర్లో యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వయం ఉపాధి శిక్షణా సంస్థను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్, రిఫ్రిజిరేటర్, ఏసీ రిపేరు, జూట్‌బ్యాగ్ తయారీ, మగ్గం నూలు, సీసీటీఈవీ కెమెరాల ఏర్పాటు, హౌస్ వైరింగ్, మొబైల్ రిపేరింగ్ వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం ద్వారా నైపుణ్యాలు పెరుగుతాయన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి రుణాల మంజూరులో యూనియన్ బ్యాంకు సాయం చేస్తుందన్నారు. 19 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగిన మహిళలు, పురుషులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విజయవాడ నాబార్డు ప్రాంతీయ కార్యాలయం స్వయం ఉపాధి శిక్షణ కోసం మంజూరు చేసిన రూ.4.35 లక్షల గ్రాంటు లేఖను నాబార్డు డీసీఎం వైఎస్ స్వామినాయుడు కలెక్టర్‌కు అందించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు రీజనల్ హెడ్ బీజీఆర్ నాయుడు, జిల్లా లీడ్ బ్యాంకు అధికారి సీహెచ్ఎస్వీ ప్రసాద్, రీజనల్ కార్యాలయ చీఫ్ మేనేజర్లు ఎస్.రవి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


చల్లా లక్ష్మి
పిఠాపురం


కంచర్ల భవానీశంకర్
పిఠాపురం


మొగిలి అప్పారావు
చిన జగ్గంపేట


నల్లే వీరప్రసన్నకుమార్
గొర్రిపూడి


పాలకుర్తి సతీష్
పెద్దాపురం


మల్లిపూడి వీరు
కాకినాడ

కార్పొరేషన్ల డైరెక్టర్లు వీరే

పిఠాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మరో విడత ప్రకటించిన కార్పొరేషన్ డైరెక్టర్ల పదవుల్లో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన ముగ్గురు జనసేన నాయకులకు అవకాశం లభించింది. జనసేన వీర మహిళ విభాగం ఉమ్మడి గోదావరి జిల్లాల కన్వీనర్, పిఠాపురం పట్టణానికి చెందిన చల్లా లక్ష్మి రాష్ట్ర కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. రాష్ట్ర దాసరి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన జనసైనికుడు కంచర్ల భవానీశంకర్ నియమతులయ్యారు. గొల్లప్రోలు మండలం చినజగ్గంపేటకు చెందిన జనసేన జిల్లా కార్యదర్శి మొగిలి అప్పారావు ఆంధ్రప్రదేశ్ సగర/ఉప్పర వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. వీరు ముగ్గురినీ పలువురు అభినందించారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాపు వెల్ఫేర్, డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా టీడీపీ కాకినాడ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరేంద్ర కుమార్ (వీరు) నియమితులయ్యారు. దశాబ్ద కాలంగా టీడీపీలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్న వీరు పార్టీ కష్టకాలంలో అధ్యక్షుడిగా వ్యవహరించారు. సోమవారం ఆయన్ను పలువురు కలిసి అభినందించారు.

కరప (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా మండలంలోని గొర్రిపూడి గ్రామానికి చెందిన నల్లే వీరప్రసన్నకుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర కళింగ కోమటి, కళింగ వైశ్య వెల్ఫేర్, డవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన పాలకుర్తి సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు వెలువడ్డాయి. కళింగ కోమటి, కళింగ వైశ్య సంఘీయుల సంక్షేమానికి, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

ఎంఎస్ఎన్ చార్టీస్ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే కొండబాబు


కంప్యూటర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎన్ చార్టీస్ అభివృద్ధికి కృషి చేస్తానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. చార్టీస్ ఎయిడెడ్ పాఠశాల 1986 బ్యాచ్ విద్యార్థి ఎస్.పాల్ అలెగ్జాండర్-సుజాత దంపతులు పాఠశాలకు కంప్యూటర్లు, గ్రీన్‌బోర్డులు, డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు బహూకరించారు. సోమవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్నాథపురంలో మినీ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అంతర్జాతీయ హాకీ క్రీడాకారుడు, పాఠశాల పూర్వ విద్యార్థి ఎంఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్న ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. చార్టీస్ ధర్మకర్తల మండలి సభ్యులు పి.దుర్గాప్రసాద్, ఎస్.సత్యసాయి. ఎం.చిన్ని, పి.లక్ష్మీప్రసన్న, ఎం.దుర్గాప్రసాద్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఉషారాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రాజశేఖర్, యాజమాన్య కమిటీ చైర్మన్ జి.సాయినందనకుమార్, వైస్ చైర్‌పర్సన్ కె.లావణ్య, ఉపాధ్యాయులు, పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.


సీతారామాంజనేయ ఆలయానికి ఇత్తడి మకరతోరణం అందిస్తున్న దాతలు

వెండి మకరతోరణం బహూకరణ

పిఠాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చింతావారి వీధిలో వేంచేసియున్న మహాలక్ష్మీ గణపతి సహిత సీతారామాంజనేయస్వామి ఆలయంలో కొలువైయున్న సీతారాములకు సాయికమల స్టీల్ హౌస్ యజమాని మారోజు సుబ్రహ్మణ్యం-రాజేశ్వరి, హరీష్-అంజనీ సోనాలీ దంపతులు రూ.50వేలతో ఇత్తడి మకరతోరణాలు తయారు చేయించి సోమవారం నిర్వాహకులకు అందజేశారు. అర్చకుడు పోతుకూచి కాశీవిశ్వనాథశాస్త్రి పూజలు చేసిన అనంతరం సీతారాములకు అలంకరించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొత్తపల్లి పద్మబుజ్జి, మాజీ కౌన్సిలర్ కోరుమిల్లి విజయలక్ష్మి, తాతపూడి వీరభద్రరావు, కొత్తపల్లి రవికుమార్, డేగల సత్తిబాబు, దూళిపూడి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

సర్పవరం జంక్షన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ కాలేజీ ఇన్‌చార్జి కందుకూరి పాల్‌రాజు పేర్కొన్నారు. సోమవారం రమణయ్యపేట ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో 120 మంది ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు ఆధ్వర్యంలో రూపొందించిన 80 సైన్స్ ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి. సుమారు 650 మంది విద్యార్థులు తిలకించి కొత్త విషయాలను నేర్చుకున్నారు.

స్థల విషయంలో ఘర్షణ

గొల్లప్రోలు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారు దుర్గాడ సెంటర్‌లో స్థలం విషయంలో ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఘర్షణలో గాబు వీరబాబుతో పాటు అతని కుమారుడికి, మరో వర్గానికి చెందిన కదిరి చక్రం, తిరగాటి కుమారిలకు గాయాలయ్యాయి. ఇరువర్గాలు పరస్పరం చేసుకున్న ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రామకృష్ణ సోమవారం రాత్రి తెలిపారు.

'పారిశుధ్య పనుల తనిఖీ

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మహాలక్ష్మినగర్, మేకల కబేళా, ముత్తానగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఇన్‌చార్జి కమిషనరు కేటీ సుధాకర్ సోమవారం పరిశీలించారు. రోడ్లపై చెత్త పేరుకుపోవడం, డ్రైనేజీలు నిండిపోవడం, మురికినీరు రోడ్లపైకి రావడం వంటి సమస్యలను గమనించి సంబంధిత అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి నాణ్యతను పరిశీలించి క్లోరిన్ శాతం అధికంగా ఉందని గుర్తించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, డీఈ లక్ష్మీనారాయణ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వైఎస్సార్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ సెకండ్ ఏఎన్ఎంల ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్ఎంలు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ సెకండ్ ఏఎన్ఎంల సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ ప్రతినిధులు మాట్లాడుతూ వర్క్ ఎడ్జెస్ట్‌మెంట్ పేరుతో సెకండ్ ఏఎన్ఎంలను సుదూర ప్రాంతాలకు, వేరే జిల్లాలకు బదిలీ చేశారన్నారు. దీంతో మూడేళ్లుగా తాము ఆర్థికంగా, మానసికంగా అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో తిరిగి సొంత ప్రాంతాల్లో నియమించాలని కోరుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ఎస్ఆర్ఎస్ పేరుతో, టెక్నికల్ సమస్యల పేరుతో వేతనాల్లో కోత విధించవద్దన్నారు. ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్ల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. 180 రోజుల చైల్డ్ కేర్ సెలవు కూడా మంజూరు చేయాలన్నారు. ఆరోగ్య బీమా అమలు చేయాలన్నారు. 2014లోపు చేరిన సెకండ్ ఏఎన్ఎంలను యూరోపియన్ స్కీం ఏఎన్ఎంల తరహాలో రెగ్యులర్ చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. సత్యకుమారి, లీలాకుమారి, రాణి, మరియమ్మ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, సంధ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ పద్మశ్రీ, మాజీ మేయర్ పావనిలను సత్కరిస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ, మాజీ మేయర్‌లకు సత్కారం

కాకినాడ సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జవహర్‌లాల్ నెహ్రూ జయంతి, బాలల దినోత్సవం పురస్కరించుకుని నగరంలోని సత్కళావాహినిలో ఈవీ కృష్ణమాచార్యులు, ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ మేయర్ సుంకర పావనిలను సత్కరించారు. తొలుత వారు భారతమాత చిత్రపటానికి పూలమాలలు వేశారు. వక్తృత్వ పోటీలో విజేతలైన బాలబాలికలకు బహుమతులు అందజేశారు. కుంజిక లక్ష్మితో పాటు మరో ముగ్గురు మహిళలకు డొక్కా సీతమ్మ అవార్డు అందజేశారు. పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. సంఘ సేవకులు అద్దంకి రాజా, జి.రాజు మాస్టారు, డాక్టర్ తురగా సూర్యారావు, మానికిరెడ్డి సత్యనారాయణ, కర్రి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

17న ముంబయి, 18న ఢిల్లీలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ ధర్నా



కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న ముంబయిలో, 18న ఢిల్లీలో ధర్నాలు నిర్వహిస్తున్నట్టు ఏపీ మెడికల్, సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకట్రావు పేర్కొన్నారు. సంబంధిత పోస్టర్‌ను సోమవారం ఆయన కలెక్టరేట్ వద్ద ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి దుంపల ప్రసాద్, కాకినాడ బ్రాంచి అధ్యక్ష, కార్యదర్శులు అప్పలస్వామి, ఏఆర్‌సీ వర్మ, సభ్యులు రామకృష్ణ, శేఖర్, శ్యామ్‌కుమార్, అప్పారావు, రామ్మూర్తి, సీఐటీయూ నాయకులు పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ పాల్గొన్నారు.


వృద్ధాశ్రమం నిర్మాణం జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

'వృద్ధాశ్రమం నిర్మాణ పనులు వేగవంతం చేయాలి'

పెద్దాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జలవనరుల శాఖకు చెందిన స్థలంలో వృద్ధాశ్రమ భవన సముదాయ నిర్మాణానికి సంబంధించిన మార్కింగ్‌ను పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గోశాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దారు సీహెచ్ వెంకటలక్ష్మి, కూటమి నేతలు పాల్గొన్నారు.

జనసేన నేతల హామీతో ఆందోళన విరమణ

పిఠాపురం రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం పి.దొంతమూరు-చినజగ్గంపేట గ్రామాల మధ్య పదేళ్లకు పైగా అసంపూర్తిగా ఉండిపోయి బ్రిడ్జి నిర్మాణాన్ని తక్షణం పూర్తి చేయాలని, అప్రోచ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ నాలుగు రోజులుగా పి.దొంతమూరు, చినజగ్గంపేట గ్రామస్తులు చేస్తున్న ఆందోళనను సోమవారం విరమించారు. దీక్షా శిబిరం వద్దకు డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు వచ్చి చర్చలు జరిపారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కలెక్టర్ దృష్టికి తీసువెళ్లి బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామని వారు తెలపడంతో దీక్షలు విరమించారు.


కరపలో కలుసుకున్న 1989-90 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల వన భోజనాల సందడి

కరప, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1989-90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం సందడి చేశారు. స్థానిక తోటలో వనభోజనాలు ఏర్పాటు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు నేమానిరామారావును సత్కరించి జ్ఞాపిక అందజేశారు. అందరూ కలిసి ఉసిరిచెట్టు, కార్తీక దామోదరుడికి పూజాధికాలు నిర్వహించారు. కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి సామూహిక వనభోజనాలు చేశారు. ఆటల పోటీల్లో విజేతలకు ఉపాధ్యాయుడు రామారావు బహుమతులు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపి ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థి, కాకినాడ ఏరియా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మేదరమాటి వెంకన్నచౌదరి (బాబి) తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ


జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో విజేతలుగా నిలిచిన వేళంగి విద్యార్థులు

కరప, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో జరిగిన కాకినాడ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో మండలంలోని వేళంగి అక్షర ఇంగ్లిష్ మీడియం స్కూలు విద్యార్థులు సత్తా చాటారు. బాలికల విభాగం మినీ సబ్ జూనియర్, సబ్ జూనియర్ కేటగిరీల్లో పి.కీర్తన, డి.వర్షిణి బంగారు పతకాలు, ఎం.లాస్య, జి.వేదసంహిత రజత పతకాలు సాధించారు. బాలుర విభాగంలో ఎ.హర్ష (బంగారు), ఎం.సుశాంత్, ఎం.వీరాంజనేయులు (వెండి), కె.యశ్వంత్, పి.ధనుష్ (రజత) పతకాలు సాధించారు. విజేతలను, కోచ్ యు.లోవరాజులను పాఠశాల యాజమాన్యం సత్కరించి అభినందనలు తెలిపింది. ప్రిన్సిపాల్ పి.నవ్య, పి.కమల్, టి.మురళీకృష్ణ, హెచ్ఎం ఎంవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అన్నదానం

ఏలేశ్వరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీస్వామి దయానంద సరస్వతీ ఆశ్రమంలో విద్యార్థులకు అన్నదానం చేశారు. సోమవారం సిరిఫుడ్స్ అధినేత పెచ్చేటి కృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో రేకు షెడ్డు నిర్మాణానికి రూ. 10వేలు, శ్మశాన వాటిక అభివృద్ధికి రూ.10వేలు, అనాథలకు దుప్పట్లు అందజేశారు. విజయబాబు, గోళ్ల నాగేశ్వరరావు, బుగతా శ్రీనివాస్, కుర్రి రామచంద్రరావు తదితరులున్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 90 అర్జీలు

రంపచోడవరం, నవంబర్ 10(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఐటీడీఏపీవో బి.స్మరణ్ రాజ్, ఆర్డీవో పి.అంబేద్కర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు ప్రజల నుంచి 90అర్జీలు స్వీకరించారు. పీహెచ్‌సీల్లో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని, గ్రామాలకు రోడ్లు ఏర్పాటు చేయాలని కోరుతూ అధికంగా అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఎల్‌డీవో కె.కోటేశ్వరరావు, ఏడీఎంహచ్‌వో సరిత, ఏపీడీ శ్రీనివాస్ విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికల చట్టాలపై అవగాహన

రంపచోడవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో నేషనల్ లీగల్ సర్వీసెస్ డే సందర్భంగా సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మండల న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.మురళి గంగాధరరావు బాల్య వివాహ, బాలకార్మిక, పోక్సో, విద్యా హక్కు చట్టం, గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పాఠశాలలో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.ఝాన్సీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను అరికట్టాలి

ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఎదుట ధర్నా

రంపచోడవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మాతా, శిశు మరణాలు అరికట్టాలని కోరుతూ ఆదివాసీ 'ంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించారు.ఈసందర్భంగా ఇటీవల ఏరియా ఆసుపత్రిలో తల్లీ బిడ్డ మృతికి కారకులైన వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఐటీడీఏ ఎదుట ధర్నా నిర్వహించారు. వినతిపత్రాన్ని ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్‌కు అందజేశారు. కోటం రాజన్నదొర, పొడియం అరుణకుమారి, కోసు దేవిశ్రీదేవి, లలితకుమారి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు చోడి ప్రదీప్‌కుమార్ దొర, బొరగ ఎర్రమ్మ, కంగల అబ్బాయిదొర, పీత ప్రసాద్, చోడి ఏడుకొండలరావుదొర, కారు అరుణ కుమారి, కలుముల ప్రసాద్‌దొర, ప్రజా సంఘాల నాయకుడు ఐవీ రమణ పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

చింతూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. నారకొండ గ్రామంలో సోమవారం పీసా ఉపాధ్యక్షుడు సీతయ్య కార్యదర్శి ముద్దరాజు ఆధ్వర్యంలో ఆదివాసీలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లంపేట యూత్ నాయకుడు శంకర్ మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆమేరకు పీసా కమిటీలు చొరవ తీసుకోవాలన్నారు. ఈనెల12న ఏడుగురాళ్ళపల్లిలో నిర్వహించనున్న సత్యాగ్రహ యాత్ర, 16న చింతూరులో తలపెట్టిన యువగళ బహిరంగ సభలు విజయవంతం చేయాలని శంకర్ కోరారు. కార్యక్రమంలో సోయం అర్జున్, కుంజా కన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వనసమారాధన

దేవీపట్నం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇందుకూరు వన్ ఏనుగుల గూడెం ఆర్‌అండ్‌ఆర్ సచివాలయం ప్రాంగణంలో ఉన్న తోట పల్లమ్మ సన్నిధిలో సోమవారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. సర్పంచ్ కుంజం రాజమణి ఆధ్వర్యంలో 500మంది కార్తీక వనభోజనాలు చేశారు.

వీఆర్‌పురం, (ఆంధ్రజ్యోతి) వడ్డిగూడెంలోని శ్రీరుద్రకోటేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో కడుపు రాము దంపతుల ఆధ్వర్యంలో సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. 3వేలమంది అన్నప్రసాదం స్వీకరించారు.

'ఏజెన్సీ నుంచి నాన్‌ట్రైబల్ టీచర్స్ వెళ్లిపోవాలి'

కూనవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి నాన్‌ట్రైబల్ టీచర్స్ వెళ్లిపోవాలని ఆదివాసీ జేఏసీ జిల్లా ఛైర్మన్ రామారావుదొర అన్నారు. బొజ్జిరాయిగూడెం గ్రామం నుంచి ఆదివాసీ సత్యాగ్రహ యాత్ర ప్రారంభమైన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల మెగా డీఎస్సీలో దగాపడ్డ ఆదివాసీ యువతకు అండగా ఉండేందుకు ఈయాత్ర ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదివాసీలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలన్నారు. ముంపు మండలాలు, రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాలతో రంపచోడవరం కేంద్రంగా తమన్నదొర పేరుతో జిల్లా ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజ అనిల్, డివిజన్ ఉపాధ్యక్షుడు ఉయిక రాంప్రసాద్, వెటకాని మల్లయ్య, గిరిజన స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర సమన్వయకర్త కిరసాని కిషోర్, పాడేరు జేఏసీ కోకన్వీనర్ పాంగి అంజిరావ్, సోడే అర్జున్, సోడే ప్రకాష్, చిక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.

గిరిజన సంఘం నూతన కమిటీ ఎన్నిక

వీఆర్‌పురం, నవంబరు10(ఆంధ్రజ్యోతి): కుంజవారిగూడెంలో జరుగుతున్న ఆదివాసీ గిరిజన సంఘం మహాసభలో గిరిజనసంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గిరిజన సంఘం మండల అధ్యక్షుడిగా కారం సుందరయ్య, కార్యదర్శిగా పూనెం ప్రదీప్‌కుమార్, 21మంది సభ్యులతో కమిటీ ఏర్పడింది.


గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

రంపచోడవరం, నవంబర్ 10(ఆంధ్రజ్యోతి): అడ్డతీగల మండలం కినపర్తి, రాజవొమ్మంగి మండలం చిన్నయపాలెం గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్)ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. 15ఏళ్లుగా ఆయా గ్రామాల్లో సుమారు 21కుటుంబాలు, 100మంది జనాభాతో కొండు జాతి గిరిజనులు నివాసం ఉంటున్నారని, వారికి పీటీజీ మైగ్రేషన్ ఉన్నప్పటికీ తహశీలార్లు కులధ్రువీకరణ పత్రాలు మంజూరులో జాప్యంచేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్‌సౌకర్యంలేక చీకట్లోనే బతుకుతున్నారన్నారు. సీపీఐ (ఎంఎల్)రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ కార్యదర్శి కోసిరెడ్డి గణేశ్వరరావు, ఆది వాసీ గిరిజన సంఘం నాయకులు సోమల కుశల, డిప్పల చిన్నబ్బాయి, మర్రి రాంబాబు, చిక్కుడు సీతమ్మ, కాకర అప్పారావు, అచ్చిరాజు పాల్గొన్నారు.

రెండు తాటాకిళ్లు దగ్ధం

ఎటపాక, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నల్లకుంట గిరిజన గ్రామంలో సోమవారం రాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తండ్రీ కొడుకులకు చెందిన రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తొలుత తెల్లం శ్రీను ఇంటికి మంటలు అంటుకున్నాయి. ఆ సమయంలో శ్రీను భార్య మంగవేణి ఇద్దరు చంటి బిడ్డలతో ఆ ఇంట్లో ఉంది. దీంతో ఆమె భయంతో ఇంటి నుంచి బయటకు పరుగులు తీసింది. అయితే మంటల వేడికి ఇంట్లో ఉన్న వంట గ్యాస్ సిలిండర్ పేలిపోయింది. దీంతో ప్రక్కనే ఉన్న శ్రీను తండ్రి సత్యరాజు ఇంటికి మంటలు వ్యాపించాయి. దీంతో రెండు ఇళ్లు క్షణాల్లో కాలిబూడిదయ్యాయి. శ్రీను ఇంట్లో రూ 30వేల నగదు, 10బస్తాల ధాన్యం, 5కాసుల బంగారం, 5తులాల వెండి కాలిపోయిందని బాధితులు తెలిపారు. అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోవడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు.

గిరిజన ప్రాంతాల్లో ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్‌ల పర్యటన



వై.రామవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలంలో భౌగోళిక పరిస్థితులు, గిరిజనుల జీవన శైలి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు వంటి అంశాలపై స్టడీ చేసేందుకు 12మంది ట్రైనీ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్‌ఎస్‌లు సోమవారం పలు గ్రామాలు సందర్శించారు. నోడల్ అధికారి ఎంపీడీవో బాపన్నదొర ఆధ్వర్యంలో తొలుత ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణ, గిరిజన సంక్షేమ, ఉపాధి హామీ, సచివాలయ వ్యవస్థ తదితర శాఖల్లో అమలవుతున్న పథకాల తీరుతెన్నుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. యార్లగడ్డలో సర్పంచ్ పల్లాల పద్మావతి ఆధ్వ ర్యంలో వారికి గిరిజన సంప్రదాయాలతో మహిళలు ఘన స్వాగతం పలికారు. దాలిపాడు, యార్లగడ్డ సచివాలయాలు సందర్శించారు. వై.రామవరంవారపు సంతలో ఉత్పత్తులను పరిశీలించారు.తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్ఐ రామకృష్ణ, ఏపీవో స్వామి, సాయిబాబా, ఎంపీపీ ఆనందరావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్‌ఎంపీపీలు విశ్వామ్మ, జోగిరెడ్డి, ఏపీఎంలు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

కార్తీకశోభ

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

అరుణాచలేశ్వరుడికి అన్నాభిషేకం

ప్రత్తిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి అడ్డురోడ్డు వద్ద కొలువై ఉన్న అరుణాచల క్షేత్రంలో సోమవారం కార్తీక సోమవారం పురస్కరించుకుని వైభవంగా అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు స్వామి రామానంద ఆధ్వర్యంలో వేద పండితులు ఈ కార్యక్రమం చేపట్టి అన్నంతో స్వామికి తెల్లటి వస్త్రాన్ని కప్పి వెండి నాగాభరణం, శూలమాలలు అలంకరించి విశిష్ట పూజలు నిర్వహించారు. కాల భైరవ హోమం, సామూహిక పంచామృత రుద్రాభిషేకాలు, పంచ హారతులు ఇచ్చారు. అన్నప్రసాద వితరణ చేశారు. అరుణాచలేశ్వరుడికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, నియోజకవర్గ సీబీఎస్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ళ జగదీష్, పర్వత సురేష్, అమరాది వెంకట్రావు, మదినే దొరబాబు, పోలిశెట్టి శ్రీను ఉన్నారు.



ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో అరుణాచలేశ్వరుడికి హారతులు ఇస్తున్న వేద పండితులు

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాలకు భక్తులు పోటెత్తారు. ఏలేశ్వరంలో శ్రీరాజరాజేశ్వరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో పురోహితులు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లో శైవ క్షేత్రాలు అయ్యప్పస్వాములు, మహిళలతో కిక్కిరిశాయి.

గండేపల్లి (ఆంధ్రజ్యోతి): మండల గ్రామాల్లో ఉన్న శివాలయాలన్నీ తెల్లవారుజాము నుంచి భక్తులతో కిటకిటలాడాయి. మల్లేపల్లి శివాలయంలో ఆలయ పురోహితులు కృష్ణవర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు తెల్లవారుజాము నుంచి జరిగాయి. నగర సంకీర్తన చేశారు.

కిర్లంపూడి (ఆంధ్రజ్యోతి): మండల గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భారీ సంఖ్యలో భక్తులు వచ్చి అభిషేకాలు, విశేష పూజలు చేశారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి, మెరక చామవరంలో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



ఏలేశ్వరం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కాట్రావులపల్లి విద్యార్థుల వైజ్ఞానిక యాత్ర



వైజ్ఞానిక యాత్రలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

జగ్గంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక కేంద్రాలను సందర్శించడం ద్వారా వైజ్ఞానిక నైపుణ్యాలను పెంచుకోవచ్చని కాట్రావులపల్లి పీఎం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు తాతపూడి వెంకటరమణ అన్నారు. ఉన్నత పాఠశాల విద్యార్థులు రాజమహేంద్రవరం విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించారు. అనేక భౌతిక రసాయన తరగతులను ప్రత్యేక నిపుణుల ద్వారా నేర్చుకున్నారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్, గోదావరి ప్రాంతాన్ని సందర్శించారు. కాటన్ మ్యూజియంలో పలు విషయాలు తెలుసు కున్నారు. అనంతరం పుష్కరవనాన్ని సందర్శించి అనేక సందర్శన స్థాళ్లను తిలకించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

14న ప్రత్తిపాడులో దివ్యాంగ బాలలకు ఉచిత ఉపకరణాల నిర్ధారణ శిబిరం

ప్రత్తిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో పిల్లల ఉచిత ఉపకారణాల నిర్ధారణ శిబిరం ఈనెల 14న నిర్వహిస్తున్నట్టు మండల విద్యాశాఖ అధికారులు వి.రాజబాబు, వై.అచ్చిరాజు తెలిపారు. దివ్యాంగుల పిల్లలకు మెడికల్ అసెస్మెంట్ క్యాంపు స్థానిక జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల నందు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. 1 తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 18ఏళ్ల లోపు దివ్యాంగుల పిల్లలు ఈ ఉచిత ఉపకారణాల నిర్ధారణ క్యాంపును వినియోగించుకోవాలని కోరారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, కిర్లంపూడి, జగ్గంపేట, గండేపల్లి మండలాలలో గల దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులు తగిన ధ్రువపత్రాలతో (ఆధార్ కార్డు, యుడిఐడి కార్డు, సదరం, సర్టిఫికెట్, రేషన్ కార్డు/ ఆదాయ ధ్రువపత్రం, 2పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు) హాజరుకావాలన్నారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం

ప్రత్తిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో పదో తరగతి విద్యార్థి సోమవారం అదృశ్యమయ్యాడు. స్థానిక ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో పదోతరగతి చదువుతున్న యాళ్ళ అనంత చిన్నారావు దంపతుల కుమారుడు నేహార్‌ను స్కూలుకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు ఆరా తీశారు... స్కూలుకు వెళ్లమని తల్లితండ్రులు శనివారం ఉదయం మందలించడంతో విద్యార్థి నేహార్ కనిపించకుండా వెళ్లిపోయాడని తల్లిదండ్రులు తెలిపారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామని తెలిపారు.. విద్యార్థి ఆచూకీ తెలిస్తే 95730 87562,80084 66398 నెంబర్లుకు తెలియజేయాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

జగ్గంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటి వద్ద నూకాలమ్మ ఆలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షుడు జీను మణిబాబు ముఖ్య అతిథులుగా హాజరై కొబ్బరి కాయలు కొట్టి భూమి పూజ చేశారు. జగ్గంపేట ఆత్మ కమిటీ డైరెక్టర్ వైభోగుల కొండబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా కార్తీక వనసమారాధనలు



రౌతులపూడి : ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో సోమవారం కార్తీక వన సమారాధనలు నిర్వహించారు. పెద శంకర్లపూడి లంపకలోవ కార్తీక వన సమారాధనలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పాల్గొని ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. భక్తులకు, స్థానికులకు అన్నప్రసాద వడ్డన చేశారు. ధర్మవరంలో కోల్డ్ స్టోరేజ్ వెనుక మామిడి తోట లో కాపు యువత ఆధ్వర్యంలో భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. ఒమ్మంగి తదితర గ్రామాల్లో కూడా వనసమారాధనలు జరిగాయి.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో ఉసిరిచెట్టు దగ్గర వనభోజనం చేయడం ఆరోగ్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మూలగపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ నిర్వహించిన వనభోజనాలకు ఎమెల్యే హాజరై తులసి చెట్టుకు పూజలు చేసి భోజనాలు వడ్డించారు. మల్లంపేటలో వన భోజనాలు జరిగాయి.

'9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి'



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జగ్గంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్, మతతత్వ, మనువాద శక్తులను ప్రతిఘటిద్దాం, సమానత్వం, సౌభ్రాతృత్వం, ప్రజాస్వామ్యం వర్ధిల్లే ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం అంటూ 2025 డిసెంబరు 6,7న కడపలో జరగనున్న 9వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, రాష్ట్ర ఇన్‌చార్జ్ కామ్రేడ్ శంకర్, రాష్ట్ర కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ కామ్రేడ్ బుగత బంగార్రావు పిలుపునిచ్చారు. సోమవారం జగ్గంపేటలోని క్షత్రియ ఫంక్షన్ హాల్ నందు సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కాకినాడ జిల్లా రెండో జిల్లా మహాసభను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కామ్రేడ్ శంకర్, బుగత బంగార్రావు, మహాసభ పరిశీలకులు కామ్రేడ్ డి.హరినాథ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కామ్రేడ్ ఉదయ్ కిరణ్, ఏగుపాటి అర్జునరావు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ కార్పొరేట్ అనుకూల విధానాలను రాష్ట్రంలో అమలుచేస్తున్న కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా అన్నివర్గాల ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కామ్రేడ్ కె.జనార్ధన్, జిల్లా కార్యదర్శిగా 25 జిల్లా కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభకు ప్రత్తిపాడు కోటనందూరు, రౌతులపూడి శంఖవరం, తుని, తొండంగి, పలు మండలాల నుంచి కార్యకర్తలు తరలివచ్చారు.

'మౌలిక వసతులు కల్పించాలి'

జగ్గంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం రామవరం గ్రామపంచాయతీ పరిధి రంగవల్లినగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రంగవల్లి నగర్‌లో నిరసన చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం రంగవల్లి నగర్ భూమి సాధించడం కోసం ఎన్నో పోరాటాలు, గొడవలు, కొట్లాటలు, కేసులు ఎదుర్కొని పేదలకు ఇళ్ల స్థలాలుగా పంచిపెట్టామని తెలిపారు. అప్పటినుంచి అధికారులు చుట్టూ తిరుగుతూ రంగవల్లి నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని వినతిపత్రాలు అందిస్తూనే ఉన్నామన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా కనీస వసతులు కల్పించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవ తీసుకుని ఇక్కడ మౌలిక వసతులు, రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. నాయకులు డాన్ శ్రీను, సత్తిబాబు, సూరిబాబు, దేవి, భవాని పాల్గొన్నారు.

నందీశ్వరుడి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న నాయకులు

కిర్లంపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వీరవరంలో పశువుల ఆసుపత్రి పక్కన నందీశ్వరుడు విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం నిర్వహించారు. గ్రామపెద్దల సహకారంతో పెద్దాపురం శిల్పి గరగా వీరబాబుతో విగ్రహాన్ని తయారుచేయించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, వైసీపీ జగ్గంపేట ఇన్‌చార్జి తోట నరసింహం, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బస్వా వీరబాబు, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ హాజరై నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది. జేజేలు గురువు, గొల్లపల్లి సూరిబాబు, చలపాక శివప్రసాద్, కమిటీ సభ్యులు మాదారపు వీరబాబు, సుబ్బారావు, గౌరీశంకర్, పిడుగు జయ, పులి రంగారావు, మట్టె కొండబాబు, కూనపరెడ్డి వీరవెంకట సత్యనారాయణ, దంటా వెంకన్న పాల్గొన్నారు.

'ఆదిత్య'లో ఇన్ఫోసిస్ కంపెనీ క్యాంపస్ ఆన్‌లైన్ పరీక్షలు

గండేపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీలో ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సౌజన్యంతో ప్రముఖ మల్టీనేషనల్ సంస్థ ఇన్ఫోసిస్ కంపెనీ నిర్వహించిన ఆఫ్ క్యాంపస్ ఆన్‌లైన్ పరీక్షలకు 22 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 2165 మంది విద్యార్థులు హాజరైనట్టు యూనివర్శిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ ప్రతినిధి డాక్టర్ డి.శ్రీనివాస్, ఇన్ఫోసిస్ కంపెనీ హెచ్‌ఆర్ మోహిత్, ఆదిత్య ప్లేస్‌మెంట్ విభాగం సిబ్బంది పాల్గొన్నారని చెప్పారు.

వెన్నా శివకు సత్కారం

రౌతులపూడి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు (శివ)ను మూలగపూడిలో టీడీపీనేతలు ఘనంగా సత్కరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణను శివ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సత్యనారాయణతో పాటు కత్తిపూడి సత్రం ఛైర్మన్ సోమ రౌతు చంద్రమౌళి, పలువురు నేతలు సత్కరించారు. లెక్కల రాము, యనుము రాజా, గాడి రాంబాబు ఉన్నారు.

'పోలీస్‌స్టేషన్ నిర్మాణం వద్దు'

రౌతులపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామం మధ్యలో పోలీస్‌స్టేషన్ నిర్మాణం నిలిపివేసి ఆ స్థలంలో గ్రంథాలయం, పార్కు నిర్మించాలని రౌతులపూడి గ్రామస్తులు సోమవారం గ్రీవెన్స్‌లో తహశీల్దార్ ఎన్వీ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో ఎమ్మెల్యేల దృష్టికి గ్రంథాలయం, పిల్లల పార్కు నిర్మించాలని కోరగా హామీఇచ్చారన్నారు. ప్రస్తుతం ఈ స్థలంలో పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి చూపించడం సరికాదని తక్షణం విరమించుకోవాలని తహశీల్దార్‌ను కోరారు. సుర్ల శ్రీనివాస్,అధికసంఖ్యలో గ్రామస్తులు ఉన్నారు.

రేపు వైసీపీ నిరసన ర్యాలీ

ప్రత్తిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈనెల 12న ప్రత్తిపాడులో నిర్వహించే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని వైసీపీ నాయకులు కోరారు. లయన్స్ కమ్యూనిటీ హాల్ వద్ద సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, మండలాధ్యక్షుడు రామిశెట్టి నాని, సర్పంచ్ ఏపూరి రామారావు, నాయకులు శేరు కృష్ణ, జువ్వల బాబులు, దొరబాబు, దాడిశెట్టి చక్రరావు తదితరులున్నారు.

చాంబర్‌కు మంచి నాయకత్వాన్ని ఎన్నుకోండి



చాంబర్ ప్రముఖులతో మాట్లాడుతున్న యనమల

తుని రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సమర్థ నాయకత్వాన్ని ఎన్నుకునే చాయిస్ మీదేనని తుని చాంబర్ ప్రముఖులకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు తెలిపారు. సోమవారం తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రముఖులతో యనమల సమావేశమయ్యారు. ఏకాభిప్రాయంతో ఒక నిర్ణయానికి వచ్చి సమర్థ నాయకత్వాన్ని ఎన్నుకుని, తద్వారా చాంబర్ ఆఫ్ కామర్స్ పురోభివృద్ధితో పాటు తుని వ్యాపారాభివృద్ధికి పాటు పడాలని సూచించారు. రాజకీయాలకు తావులేకుండా ఎంపిక ఉండాలని, ఆ దిశగా చాంబర్ ప్రముఖులు ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ యినుగంటి సత్యనారాయణ, మోతుకూరి వెంకటేష్, కుసుమంచి సత్యనారాయణ, కుక్కడపు బాలాజీ, కారుమూరి భద్రరావు, నార్ల రత్నాజీ, తటవర్తి రాజా, దంతులూరి శ్రీనివాస రాజు, దంతులూరి బాబు, దర్శి మోహన్ కృష్ణ, సూరంపూడి చంద్రశేఖర్, పరవాడ తాతబాబు, దండెం నాగు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న కల్యాణానికి రాట మహోత్సవం

శంఖవరం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వజ్రకూటం వేంకటేశ్వరస్వామి కల్యాణానికి సోమవారం పందిరి రాట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ కీర్తి వెంకటసుభాష్, గ్రామపెద్దలు సమక్షంలో వేడుక నిర్వహించారు. ఈనెల15న స్వామి అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తామని, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. సకురు విష్ణుమూర్తి, కోలా ఈశ్వరుడు, చిన్నారి దొరబాబు, కీర్తి శ్రీనివాస్, కేశంగి సూర్యారావు పాల్గొన్నారు.

కౌన్సిల్ ఆమోదం లేకుండా రోడ్డు నిర్మాణం ఎలా

తునిరూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ ఆమోదం లేకుండా తునిలో పలు వార్డుల్లో రోడ్ల నిర్మాణం ఎలా చేపడతారని కౌన్సిలర్లు ప్రశ్నిం చారు. సోమవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 28వ రోడ్డు నిర్మాణ అంశాన్ని వైసీపీ కౌన్సిల్ సభ్యులు లేవనెత్తారు. పని ప్రారంభించేసిన తరువాత కౌన్సిల్ ఆమోదానికి తీసుకురావడం ఏమిటని అధికారులను వారు నిలదీశారు. అధికార పక్షానికి చెందిన కౌన్సిల్ సభ్యులు జోక్యం చేసుకుని తుని పట్టణంలో పనులన్నీ నిబంధనలకు అనుగుణంగా జరుగుతున్నాయని, గత ప్రభుత్వ మాదిరిగా అడ్డగోలు వ్యవహారాలు కూటమి ప్రభుత్వంలో జరగవన్నారు. అప్పుడు నిలదీయని వైసీపీ కౌన్సిల్ సభ్యులు ఇప్పుడు చర్చకు దిగడం హాస్యాస్పదమన్నారు.

సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా సూరిబాబు



తుని రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తుని మండలం హెచ్ కొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు ములికి సూరిబాబు సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, తుని ఎమ్మెల్యే యనమల దివ్య సహకారంతో ఆయనకు ఈపదవి దక్కింది.

భక్తులతో శివాలయాలు కిటకిట

తొండంగి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తొండంగి రాజరాజేశ్వరీ సహిత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి అభిషేకాలు జరిగాయి. ఏ.కొత్తపల్లి కదంబ క్షేత్రంలో విజయేశ్వరీ సహిత భువనేశ్వరీ అమ్మవారికి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలు అందించారు.బెండపూడి శివాలయంలో అభిషేకాలు జరిగాయి

కోటనందూరు,(ఆంధ్రజ్యోతి)కార్తీకమాసం మూడో సోమవారం కోటనందూరు, కెవోఅగ్రహారం, బీమవరపు కోట, అల్లిపూడి, బొద్దవరం, బంగారయ్యపేట తదితర శివాలయాల్లో పూజలు నిర్వహించారు. కోటనందూరు, బొద్దవరం శివాలయాల్లో అన్నదానం నిర్వహించారు. .

13న దివ్యాంగ ఉపకరణాలకు నిర్ధారణ పరీక్షలు

తొండంగి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల కోసం ఈనెల13న నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారని ఐఈఆర్టీ నాగేశ్వరరావు తెలిపారు. అర్హత కలిగిన వారంతా హాజరుకావాలని కోరారు. తుని బాలికల ఉన్నత పాఠశాలలో ఒకటి నుంచి ఇంటర్‌వరకు చదివే దివ్యాంగ పిల్లలకు ఉపకరణాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు.